నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA
Digital Editions
www.nirbhayavaartha.in
https://nirbhayavaartha.in

# నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA TELUGU DAILY






సంపుటి : 13 సంచిక : 72 రంగారెడ్డి గురువారం 09 జులై 2026 ఎడిటర్ : బవనారి రవికుమార్ 09-07-2026 Thursday పేజీలు : 8 వెల : రూ॥ 1-00

Circulated To: Hyderabad-Rangareddy-Nizamabad-Warangal-Mulugu-Yadadri-Nalgonda-Karimnagar-Khammam-Medak-Sangareddy- Siddipet-Medchal-Jagityal-Vemulawada


## తెలంగాణలో రూ.300 కోట్ల
# గోద్రేజ్ ఆయిల్ పామ్ ప్రాజెక్ట్..
### సీఎం రేవంత్‌తో కీలక భేటీ



**నిర్భయవార్త ప్రతినిధి :హైదరాబాద్ :**

హైదరాబాద్, జులై 8 : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో గోద్రేజ్ ఇండస్ట్రీస్ గ్రూప్ ప్రెసిడెంట్( కార్పొరేట్ వ్యవహారాలు) రాకేశ్‌స్వామి, గోద్రేజ్ అగ్రోవెట్ ఆయిల్ పామ్ బిజినెస్ సీఈఓ సౌగతో నియోగి బుధవారం కలిశారు. గోద్రేజ్ ఆగ్రోవెట్ కంపెనీ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగు విస్తరణపైన ముఖ్యమంత్రికి నివేదిక అందజేశారు రాకేశ్ స్వామి. తెలంగాణలోనే మొట్టమొదటి ప్రైవేట్ సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్ త్వరలో ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో పలు కీలక అంశాలపైన సీఎం చర్చించారు.ఖమ్మం జిల్లాలో రూ.300 కోట్ల పెట్టుబడితో ఏర్పాటవుతున్న ఈ ప్రాజెక్ట్ ద్వారా 700 మందికి పైగా ఉపాధి లభించనుంది. ఆయిల్ పామ్ ప్రాసెసింగ్, నర్సరీ, ఆర్ అండ్ డీ కేంద్రం, సీడ్ గార్డెన్ ఏర్పాటు కోసం ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం గుబ్బగుర్తి గ్రామంలో 113.5 ఎకరాల భూమిని గోద్రేజ్ ఆగ్రోవెట్ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. సీడ్ గార్డెన్ కోసం అదనంగా 35 నుంచి 40 ఎకరాల భూమిని కేటాయించాలని ప్రభుత్వాన్నిఈ సంస్థ కోరింది. ప్రాసెసింగ్ మిల్ కోసం రోడ్డును విస్తరించాలని ముఖ్యమంత్రిని ఈ సంస్థ ప్రతినిధులు కోరారు. టీజీఐఐసీ ఆధ్వర్యంలో రోడ్డు విస్తరణ చేపట్టాలని సంబంధిత అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

## తెలంగాణలో కేంద్రమంత్రి జేపీ నడ్డా పర్యటన..

**నిర్భయవార్త ప్రతినిధి : హైదరాబాద్**



కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా గురువారం తెలంగాణలో పర్యటించనున్నారు. పలు కార్యక్రమాలకు ఆయన హాజరుకానున్నారు. ఈ మేరకు నడ్డా పర్యటన షెడ్యూల్ ఖరారైంది. నేడు ఉదయం 10:55 నిమిషాలకు శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకోనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు బీబీనగర్ ఎయిమ్స్‌కు వెళ్లనున్నారు. మధ్యాహ్నం 12 నుంచి 1:30 గంటల వరకు ఎయిమ్స్‌పై సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. 2:45 నుంచి బీబీనగర్ ఎయిమ్స్ నుంచి బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి బయల్దేరనున్నారు. మధ్యాహ్నం 3:30 గంటలకు బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి వెళ్లనున్నారు. నేడు మధ్యాహ్నం 3:30 నుంచి 5 గంటల వరకు బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ముఖ్య నేతలతో నడ్డా కీలక సమావేశం నిర్వహించనున్నారు. సాయంత్రం 5:10 గంటలకు బీజేపీ రాష్ట్ర కార్యాలయం నుంచి తాజ్ డెక్కన్‌కు వెళ్లనున్నారు. సాయంత్రం 5:30 నుంచి 7 గంటల వరకు తాజ్ డెక్కన్‌లో మేధావులతో సమావేశం కానున్నారు. తాజ్ డెక్కన్ నుంచి 7:10 నిమిషాలకు బయలుదేరి శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌నకు వెళ్లనున్నారు. రాత్రి 9 గంటలకు శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుంచి ఢిల్లీకి జేపీ నడ్డా వెళ్లనున్నారు.

## తెలంగాణ విద్యారంగానికి జాతీయ స్థాయిలో గుర్తింపు..
### పీజీఐ 2.0 ర్యాంకింగ్‌లో భారీ పురోగతి

**నిర్భయవార్త ప్రతినిధి :హైదరాబాద్ :**

పర్ ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ 2.0 ర్యాంకింగ్‌లో తెలంగాణ రాష్ట్రం గణనీయమైన పురోగతి సాధించింది. గతంలో 31వ స్థానంలో ఉన్న రాష్ట్రం ప్రస్తుతం 26వ స్థానానికి చేరుకుంది. అలాగే PGI స్కోరు 552.5 నుంచి 599.7కు పెరగడం రాష్ట్ర విద్యా వ్యవస్థలో నమోదైన మెరుగుదలకు నిదర్శనంగా నిలిచింది. దీంతో తెలంగాణ ఆకాంక్షి-1 విభాగం నుంచి ప్రచేష్ట-3 విభాగంలోకి చేరుకుంది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన విద్యా సంస్కరణల ఫలితంగా జనగాం, మంచిర్యాల జిల్లాలకు ఉత్తమ్-3 గుర్తింపు లభించింది. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి 10,006 మంది కొత్త ఉపాధ్యాయులను నియమించగా, 25,950 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించింది. అదేవిధంగా 1.12 లక్షల మంది ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ అందించి బోధన నాణ్యతను మరింత మెరుగుపరిచింది. విద్యార్థుల నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

## పోలీసుల ఫిట్‌నెస్‌కు క్రీడలే బలమైన పునాది: డీజీపీ సి.వి. ఆనంద్

**నిర్భయవార్త ప్రతినిధి :హైదరాబాద్ :**




విధి నిర్వహణలో నిరంతరం ఒత్తిడికి గురయ్యే పోలీసుల్లో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసాన్ని పెంపొందించేందుకు క్రీడలు అవశ్యకమని రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ స్పష్టం చేశారు. తెలంగాణ పోలీస్ వెల్ఫేర్ కార్యక్రమాల్లో భాగంగా చేపట్టిన 5వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ 2026 బుధవారం మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ప్రారంభమైంది. ఆర్ఎస్ఐ గోవిందరెడ్డికి స్పోర్ట్స్ టార్చ్‌ను అందజేసి డీజీపీ క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు.

**సమయ వృథాగా భావించొద్దు..**

ఈ సందర్భంగా డీజీపీ ఆనంద్ మాట్లాడుతూ.. "నాకు గోల్ఫ్ ఆడటం ధ్యానం చేసినంత ప్రశాంతతను ఇస్తుంది. ఎంత బిజీ షెడ్యూల్ ఉన్నా క్రీడలు నాకు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయి. నేను ఒకరోజు పోలీసింగ్‌ను ఆపవచ్చేమో కానీ.. క్రీడలు ఆడటం మాత్రం ఎప్పటికీ ఆపను. క్రీడలను ఎట్టి పరిస్థితుల్లోనూ సమయ వృథాగా భావించవద్దు" అని అన్నారు. ప్రతి యూనిట్‌లోని ప్రతిభావంతులను గుర్తించి ప్రోత్సహించాలని కోరారు. గతేడాది అఖిల భారత పోలీస్ క్రీడల్లో తెలంగాణ బృందం 21 పతకాలు సాధించిందని, ఆ సంఖ్యను, ముఖ్యంగా బంగారు పతకాలను మరింత పెంచేలా కృషి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

(మిగతా 3లో..)

## జులై 20 నుంచి బల్కంపేట ఎల్లమ్మ వార్షిక కళ్యాణోత్సవాలు: కొండా సురేఖ



**నిర్భయవార్త ప్రతినిధి :హైదరాబాద్ :**

నగరంలోని బల్కంపేట ఎల్లమ్మ బోనాల ఉత్సవాలకు సర్వం సిద్ధం చేయాలని అధికారులను దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. బల్కంపేట ఎల్లమ్మ దర్శనం అష్టాదశ శక్తిపీఠాల దర్శనంతో సమానమని భక్తుల విశ్వాసం అని పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్‌లో బోనాల జాతర, కళ్యాణోత్సవ పోస్టర్లను మంత్రి కొండా సురేఖ ఆవిష్కరించారు. వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. జులై 20 నుంచి 22 వరకు ఎల్లమ్మ అమ్మవారి వార్షిక కళ్యాణోత్సవాలు జరుగుతాయని వివరించారు. జులై 20 సాయంత్రం ఎదుర్కోలు ఉత్సవంతో ఈ వేడుకలు ప్రారంభమవుతాయని తెలిపారు.జులై 21న వైభవంగా ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణోత్సవం జరుగుతుందని మంత్రి కొండా సురేఖ చెప్పారు. జులై 22న సాయంత్రం ఘనంగా రథోత్సవం నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ ఉత్సవాలకు లక్షలాది మంది భక్తులు తరలివస్తారన్నారు. ఈ నేపథ్యంలో అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమన్వయంతో పనిచేయాలని అధికారులు, సిబ్బందిని మంత్రి ఆదేశించారు.వర్షాకాలం నేపథ్యంలో విద్యుత్ సేవలు, భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు స్పష్టం చేశారు సురేఖ. పోలీసులతో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేయాలని అన్నారు. ట్రాఫిక్ మళ్లింపునకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలనీ సూచించారు. మహిళలు, వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటుచేయాలని ఆదేశించారు. పరిశుభ్రత, మొబైల్ టాయిలెట్లు, తాగునీటి ఏర్పాట్లు పూర్తిచేయాలని జీహెచ్ఎంసీ అధికారులకు స్పష్టం చేశారు. వైద్య శిబిరాల ఏర్పాటు, 108 అంబులెన్స్‌లతోపాటు అత్యవసర వైద్య బృందాలనూ సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులను మంత్రి ఆదేశించారు.

## తెలంగాణలో పెట్టుబడులకు కెనడా ఆసక్తి..
### సీఎం రేవంత్‌తో హైకమిషనర్ భేటీ

**నిర్భయవార్త ప్రతినిధి : హైదరాబాద్ :**



కెనడా హైకమిషనర్ క్రిస్ కూటర్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. సీఎం నేతృత్వంలోని తెలంగాణ బృందం కెనడాలో పర్యటించాలని ప్రతినిధులు ఆహ్వానం పలికారు. తెలంగాణ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌కు కెనడా కంపెనీలకు సీఎం ఆహ్వానం పలికారు. తెలంగాణలో పెట్టుబడులు పెంచేందుకు కెనడా ప్రతినిధులు ఆసక్తి చూపించారు. మూసీ రివర్‌ఫ్రంట్, మెట్రో విస్తరణ, ఫ్యూచర్ సిటీపై కెనడా ప్రతినిధులతో సీఎం కీలక చర్చలు జరిపారు.హరిత ఆర్థిక వ్యవస్థ, సౌర విద్యుత్ రంగాల్లో కెనడా సహకారం కోరారు సీఎం. హైదరాబాద్‌లో కెనడా యూనివర్సిటీల మల్టీ-క్యాంపస్ ఏర్పాటు ప్రతిపాదన చేశారు. ఐటీ, లైఫ్ సైన్సెస్, డిఫెన్స్, ఏరోస్పేస్‌లో తెలంగాణ పురోగతిని ముఖ్యమంత్రి వివరించారు. తెలంగాణపై కెనడా కంపెనీల విశ్వాసం పెరుగుతోందని సీఎం రేవంత్, క్రిస్ కూటర్ తెలిపారు. ఉద్యోగాల కల్పన, పెట్టుబడుల ఆకర్షణలో తెలంగాణను హైకమిషనర్ ప్రశంసించారు. ఇంధనం, పట్టణాభివృద్ధి, డిఫెన్స్ రంగాల్లో కెనడా ట్రేడ్ డెలిగేషన్ త్వరలో తెలంగాణకు రానుందని వివరించారు. తెలంగాణ అభివృద్ధికి అన్నివిధాలా సహకరిస్తామని కెనడా ప్రతినిధులు హామీ ఇచ్చారు.

**సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన అంతర్జాతీయ ప్రతినిధులు**

సీఎం రేవంత్‌రెడ్డిని అంతర్జాతీయ ప్రతినిధులు కలిశారు. (మిగతా 3లో..)

## కూలిన నాలుగు అంతస్తుల భవనం

**ఢిల్లీ:నిర్భయవార్త**



దేశ రాజధాని ఢిల్లీలో బుధవారం సాయంత్రం ఘోర ప్రమాదం జరిగింది. ఉదయం నుంచి ఎడతెరపి లేకుండా కురిసిన భారీ వర్షానికి రోహిణి సెక్టార్ 16 ప్రాంతంలో ఉన్న నాలుగు అంతస్తుల భవనం అకస్మాత్తుగా కుప్పకూలిపోయింది. ఈ ప్రమాదంతో అక్కడ ఒక్కసారిగా తీవ్ర కలకలం రేగింది. కాగా.. భవన శిథిలాల కింద పలువురు వ్యక్తులు చిక్కుకుని ఉంటారని స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం.. కూలిపోయిన భవనం చాలా పాతదిగా ఉన్నట్లు సమాచారం. ఆ భవనంలో కొన్ని మరమ్మతు పనులు చేస్తుండగా.. అకస్మాత్తుగా కుప్పకూలినట్లు స్థానికులు చెప్తున్నారు. స్థానికుల సమాచారంతో ఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు, ఢిల్లీ ఫైర్ సర్వీస్ సిబ్బంది ఘటనా ప్రాంతానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాలను తొలగిస్తూ.. లోపల చిక్కుకున్న వారి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. మునిసిపల్ అధికారులు సైతం రంగంలోకి దిగి సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. ఈ ప్రమాదంలో ఎంతమంది శిథిలాల కింద చిక్కుకున్నారు? ఎవరికైనా ప్రాణనష్టం జరిగిందా? అనే విషయాలను అధికారులు ఇంకా అధికారికంగా ధృవీకరించలేదు. బాధితుల పరిస్థితి, ఆస్తి నష్టం, ప్రమాదానికి గల పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

నిర్భయవార్త

సంపాదకీయం


గురువారం 09 జులై 2026

# అమానవీయం..

కార్మికులు, ఉద్యోగుల పక్షాన భరోసా ఇవ్వాల్సిన ఉద్యోగుల భవిష్య నిధి కార్పొరేట్లకు, యజమానులకు కొమ్ముకాయడం శోచనీయం. దేశంలో సామాజిక పింఛన్ల కంటే ఘోరంగా ఉద్యోగుల పెన్షన్ పథకం (ఇపిఎస్) ఉన్నా పట్టించుకునే తీరిక పన్నెండేళ్లుగా కొలువుదీరిన మోడీ సర్కారుకు లేకపోవడం దారుణం. ఇపిఎఫ్ఒ 2024-25 వార్షిక నివేదిక ప్రకారం సంస్థ పరిధిలోని 81.5 లక్షల మంది పెన్షనర్లలో సుమారు 36.8 లక్షల మంది పొందేది వెయ్యి లేదా అంతకంటే తక్కువ పింఛనేనంటే కేంద్రానికి కార్మికవర్గం పట్ల ఉన్న వివక్షను అర్థం చేసుకోవచ్చు. పింఛను పెంపుతోపాటు కనీస వేతనం పెంపుకోసం ఆశించిన చందాదారులకూ సంస్థ తాజాగా జారీ చేసిన నిబంధనలు మొండిచేయి చూపడం క్షమార్హం కాదు. దశాబ్దాలుగా కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాసేలా లేబర్ కోడ్స్‌ను తీసుకొచ్చింది. సామాజిక భద్రతా కోడ్ - 2020ని గత ఏడాది నవంబర్ నుంచి అమలు చేస్తోంది. ఉద్యోగుల భవిష్య నిధి (ఇపిఎఫ్), ఉద్యోగుల పెన్షన్ పథకం (ఇపిఎస్), ఉద్యోగుల డిపాజిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ కోసం కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ జారీ చేసిన కొత్త నిబంధనలు చందాదారులకు, పింఛనర్లకు ఎటువంటి ఊరటనివ్వలేదు. ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ యాక్ట్ - 1948, ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్స్ అండ్ మిస్‌లేనియస్ ప్రావిజన్స్ యాక్ట్ - 1952 వంటి తొమ్మిది చట్టాలను విలీనం చేస్తూ రూపొందించిన కొత్త కోడ్‌కు అనుగుణంగా సామాజిక భద్రతా చర్యలను అమలు చేయాలన్న ప్రతిపాదనకు ఇపిఎఫ్ఒ కేంద్ర ధర్మకర్తల మండలి (సిబిటి) నాలుగు నెలల క్రితం ఆమోదం తెలిపింది. ఉద్యోగుల పింఛను పథకం - 1995 స్థానంలో ఇపిఎస్-2026 కు మండలి ఆమోదం తెలపడం ఏకపక్ష చర్య. ఈ నిర్ణయాలన్నీ యజమానుల కొమ్ము కాసేవి, కార్మికులకు నష్టం కలిగించేవే. లబ్ధిదారులతో ఏవిధమైన సంప్రదింపులు జరపకుండా తీసుకున్నవే. సుమారు ఎనిమిది కోట్ల మంది చందాదారులు, 81.5 లక్షల మంది పింఛనుదార్లకు ప్రయోజనం కలిగించాలన్న, వారి భవిష్యత్‌కు భరోసా ఇవ్వాలన్న ఆలోచన సర్కారుకు ఏమాత్రం కలగకపోవడం అమానవీయం.పన్నెండేళ్ల క్రితం నిర్ణయించిన కనీస పింఛను వెయ్యి రూపాయలను, పిఎఫ్ చందా కోసం ఉన్న రూ.15 వేల వేతన పరిమితిని తాజా నోటిఫికేషన్ సవరిస్తుందని, గణనీయంగా పెంచుతుందని ఆశించిన ఇపిఎఫ్ చందాదారులకు తాజా ఉత్తర్వులు తీవ్ర నిరాశ కలిగించాయి. సోషల్ మీడియాలో కనీస పింఛను రూ.10 వేలు చేశారని, వేతన పరిమితిని రూ.25 వేలకు పెంచారని నిత్యం తప్పుడు ప్రచారం చేసే సంఘ్ శ్రేణులకు కొదవే లేదు. అత్యధిక కాలం కేంద్రంలో అధికారం వెలగబెట్టామని ప్రచారం చేసుకుంటున్న మోడీ సర్కారు వారి ఆశలను ఇన్నేళ్లుగా పట్టించుకోకపోవడం పాలకుల వర్గ నైజాన్ని ఎత్తిచూపేదే. అంతేకాదు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తీసుకున్న చర్యలన్నీ ఉద్యోగుల ప్రయోజనాలకు విఘాతం కలిగించేవే. పెన్షనర్ పొందే చివరి జీతానికి 12 నెలల సగటు నుంచి 60 నెలలకు మార్పు చేశారు. దీనివల్ల వారి పెన్షన్ మొత్తం గణనీయంగా తగ్గిపోయింది. ఈ నిర్ణయం ఉద్యోగుల కుటుంబాల భవిష్యత్‌ను తీవ్రంగా నష్టపరిచింది. వేతన పరిమితితో సంబంధం లేకుండా మూల వేతనంలో 12 శాతం వరకూ చందా చెల్లించే విధానం కోవిడ్ -19 మహమ్మారి వచ్చే వరకూ ఉండేది. యాజమాన్యాలు వేతన పరిమితిని రూ.15 వేలకు పరిమితం చేయడం, దానిని కేంద్రం ఆమోదించడం చందాదారుల ప్రయోజనాలకు విఘాతమే. పింఛనుదారులకు ప్రయోజనం చేకూర్చే కనీస పెన్షన్ కోసం ప్రభుత్వం ఏటా అందించే గ్రాంట్ ఇన్ ఎయిడ్ (ఆర్థికసహాయం) వెయ్యి కోట్లే. వేతనంతో సంబంధం లేకుండా చందాదారులందరికీ గౌరవప్రదమైన, జీవనాన్ని కొనసాగించేందుకు తగినంత ఇపిఎస్ వర్తించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టడం కనీస బాధ్యత. కనీస వేతన పరిమితిని గణనీయంగా పెంచాలి. రెక్కలు ముక్కలు చేసుకుని చెమటోడ్చే చందాదారుల కష్టాన్ని యజమానులకు ధారాదత్తం చేసే విధానాలకు ఇకనైనా ముగింపు పలకాలి. లేకుంటే శ్రమజీవుల ప్రతిఘటనను ఎదుర్కోక తప్పదు.

# నియంత్రిత ప్రజాస్వామ్యం - నిర్వీర్యమైన రాజ్యాంగబద్ధ సంస్థలు

ఆధునిక రాజ్య కార్యనిర్వాహక వర్గం అనేది మొత్తం బూర్జువా వర్గం ఉమ్మడి వ్యవహారాలను నిర్వహించే ఒక కమిటీ మాత్రమేనని కమ్యూనిస్ట్ మేనిఫెస్టో వివరిస్తుంది. మన దేశానికి సంబంధించి ఆ సూత్రీకరణను కూడా సవరించాల్సిన అవసరం ఉంది. దేశంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితి ఒక ఉదారవాద రాజ్యానికి చెందిన తటస్థ యంత్రాంగం ద్వారా బూర్జువా వ్యవహారాల సాధారణ నిర్వహణ కంటే చాలా విస్తృతమైనది, గుణాత్మకంగా భిన్నమైనది, గతంలో ఎన్నడూ చూడనిది అని చెప్పుకోవాలి. కార్యనిర్వాహక అధికారాన్ని నియంత్రించడానికి, పరిమితం చేయడానికి ఉద్దేశించిన ప్రతి సంస్థను రాజ్యం హస్తగతం చేసుకోవడాన్ని మనం ఈరోజున చూస్తున్నాం. ఈ సంస్థలన్నీ ఇప్పుడు హిందూత్వ భావజాలంతో పెనవేసుకుపోయిన నిర్దిష్ట బడా పెట్టుబడిదారీ వర్గ ప్రయోజనాలకు లోబడి పనిచేస్తున్నాయి. ఈ తేడాను మనం స్పష్టంగా విశ్లేషించాల్సిన అవసరం ఉంది.




**కార్పొరేట్ రాజ్యం - దాని రాజకీయ ఆర్థిక వ్యవస్థ**

మన విశ్లేషణను ఆర్థిక పునాదితో ప్రారంభిద్దాం, ఎందుకంటే మిగిలినవన్నీ ఈ పునాది మీదనే ఆధారపడి ఉంటాయి. దేశంలో 1991 నుండి మార్కెట్ అనుకూల విధానాలు అమలులో ఉన్నాయి. అయితే, బిజెపి పాలన సాగిన దశాబ్ద కాలం 2014 వరకు అనుసరించిన సాధారణ మార్కెట్ అనుకూల పంథాకు భిన్నమైన ఒక కొత్త పరిస్థితిని సృష్టించింది. 2014లో, అధికార పార్టీ రాజకీయ యంత్రాంగాన్ని ఒక నిర్దిష్ట కార్పొరేట్ సమూహాలతో విలీనం చేసే ప్రక్రియను చేపట్టింది. ఈ పరస్పర బంధం ఎంత బలంగా ఉందంటే, కీలక రంగాలలో రాజ్యం, ప్రైవేట్ పెట్టుబడి మధ్య సరిహద్దులు ఆచరణాత్మకంగా అదృశ్యమయ్యాయి. కార్పొరేట్లు బిజెపి లో రాజకీయ పెట్టుబడి పెట్టాయి. అందుకు ప్రతిగా ప్రభుత్వ రంగ సంస్థల పెట్టుబడుల ఉపసంహరణ, పర్యావరణ, భూసేకరణ అనుమతుల నిబంధనల సవరణ, కార్పొరేట్ రుణాలను మాఫీ చేయడానికి అనువుగా బ్యాంకింగ్ వ్యవస్థ పునర్వ్యవస్థీకరణ వంటి వివిధ రూపాల్లో భౌతిక ప్రయోజనాలను పొందాయి. మరీ ముఖ్యంగా ఈ సందర్భంలో, రాజకీయ అధికారం అనేది కార్పొరేట్ పెట్టుబడిపై లభించే లాభంలా మారిపోయింది. ఇవన్నీ ప్రజాస్వామ్య పాలనకు తీవ్రమైన ముప్పుగా పరిణమించాయి. కార్యనిర్వాహక వ్యవస్థ స్వభావమే అధికార పార్టీ, వారి మిత్రుల అవసరాలకు అనుగుణంగా క్రమంగా మలచబడుతుంది.

**కొనుగోళ్లు, విలీనాలు - నూతన పెట్టుబడి సంచయనం**

కార్పొరేట్ ఫైనాన్స్ రంగానికి చెందిన భాష చాలా నికార్సుగా రాజకీయ ఆచరణలోకి మారింది. కార్పొరేట్ బోర్డ్‌రూమ్‌లు తరచుగా యం అండ్ ఎ (మెర్జర్స్ అండ్ అక్విజిషన్స్) అనే పదాన్ని ఉపయోగిస్తాయి, కొనుగోళ్లు, విలీనాలు, బలవంతపు స్వాధీనాలు ఇవన్నీ యం అండ్ ఎ కోవకు వస్తాయి. ఇది రాజకీయ రంగంలో బీజేపీ కార్పొరేట్ యం అండ్ ఎ సంస్కృతిని పుణికి పుచ్చుకుని ఎన్నికల ఏకీకరణకు, రాజకీయ ఆధిపత్యానికి ఒక ప్రధాన సాంకేతికతగా ఉపయోగపెట్టుకున్నది.మధ్యప్రదేశ్, కర్ణాటక, మణిపూర్ వంటి రాష్ట్రాల్లో ఎన్నికైన కాంగ్రెస్ శాసనసభ్యులను వ్యవస్థీకృతంగా వేటాడటం, గంపగుత్తగా కొనుగోలు చేయడం ద్వారా ఇంజనీరింగ్ చేసిన ప్రభుత్వాల పతనంతో ఈ రాజకీయ కార్పొరేట్ క్రీడ మొదలైంది. స్వీయ వైరుధ్యాల వలన ఇప్పటికే బలహీనపడిన కాంగ్రెస్ పార్టీ, బయటి నుండి వ్యూహాత్మకంగా జరిపిన ఈ పార్టీ ఫిరాయింపుల వల్ల మరింత దెబ్బతిన్నది. ఇది ఓటర్లు ఇచ్చిన తీర్పుపై వంచనాపూర్వకంగా చేసిన దాడి తప్ప మరొకటి కాదు. చట్టపరమైన అస్పష్టతను దుర్వినియోగం చేసుకోవడం ద్వారా బిజెపి ఇలాంటి అక్రమాలకు, అవినీతికి పాల్పడింది. శివసేన, ఆప్, తృణమూల్ కాంగ్రెస్ పార్టీలు తరువాత లక్ష్యాలుగా మారాయి. ఏకనాథ్ షిండే శివసేన శాసనసభా పక్షాన్ని హస్తగతం చేసుకోవడం, అజిత్ పవార్ ఎన్.సి.పి ని చీల్చడం, రాఘవ్ చద్దా మరో ఆరుగురు ఎంపీలతో కలిసి బిజెపి లోకి ఫిరాయించడం వంటివి ప్రోత్సాహకాలు, కాలపరిమితులు, విలీనం తర్వాత సమకూర్చిన ప్రయోజనాలతో కూడిన కార్పొరేట్ కొనుగోళ్లలాగా సాగాయి. రాజకీయ నాయకుల ఈ భవిష్య వ్యాపారం ("ఫ్యూచర్ ట్రేడింగ్" ) ఎంత సాధారణం అయిపోయిందంటే, దీనిని ఇప్పుడు ఒక కుంభకోణంగా, ప్రజాస్వామ్య విరుద్ధంగా, అనైతికతగా ఎవరూ భావించడం లేదు. ఈ రాజకీయ తొత్తడాలు నియోజకవర్గాల పునర్విభజన అనే మరో కీలక అంశంతో ముడిపడి ఉన్నాయి. ఈ విశ్లేషణ ఈ వ్యాసం తరువాయి భాగంలో వివరిస్తాను. ప్రస్తుతానికి, ఈ కొనుగోలు గణితం రాజకీయ భౌగోళిక గణితంతో లోతుగా ముడిపడి ఉందని గ్రహించగలిగితే చాలు.

**వాషింగ్ మెషీన్**

ప్రస్తుతం ప్రజల సాధారణ సంభాషణల్లోకి ఒక రాజకీయ పదం విస్తృతంగా వచ్చి చేరింది, అదే - వాషింగ్ మెషీన్. ప్రతిపక్షంలోని ఒక నాయకుడిపై అవినీతి ఆరోపణలు, క్రిమినల్ కేసులు, ఈడీ సమన్లు ఉంటాయి---రాజకీయ ఒత్తిడికి సాధనాలుగా దర్యాప్తు సంస్థల పూర్తి ఒత్తిడి వారిపై ప్రయోగించబడుతుంది. అదే నాయకుడు ప్లేట్ ఫిరాయించి, బిజెపి లో చేరిన వెంటనే ఆశ్చర్యకరంగా కేసులు వీగిపోవడం, ఈడికగా సాగడం, సమన్ల జోరు తగ్గడం, హడావిడి ప్రాసిక్యూషన్ మాయమవ్వడం చోటు చేసుకుంటుంది. మూసబోసినట్లు సాగే ఈ అప్రకటిత వేధింపుల ధోరణి రాజకీయ విధేయతలను బట్టి మారుతూ వస్తుంటే ఇక చట్టాలకు విలువ లేకుండా పోతుంది. అది చట్టం ముసుగు ధరించిన ఒక అణిచివేత రూపంగా మారుతుంది.

**ఫిరాయింపుల నిరోధక చట్టం - పునాది లేని నిర్మాణం**

పైన పేర్కొన్న హోల్‌సేల్ రాజకీయ వ్యాపారాన్ని నిరోధించడానికి, 1985 లో పదో షెడ్యూల్, ప్రజాదరణ పొందిన ఫిరాయింపుల నిరోధక చట్టం తీసుకొచ్చారు. మొదటి నుండి పదో షెడ్యూల్ లోపాలు ఉన్నప్పటికీ ప్రజాప్రతినిధుల కొనుగోళ్లు, అమ్మకాలు ప్రాతినిధ్య ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని నిర్ధారించడానికి ఈ చట్టం రాజ్యాంగబద్ధమైన సమ్మతిగా ముందుకు వచ్చింది. అయితే ఇప్పుడు ఆ సమ్మతి కేవలం ఒక నామమాత్రపు తంతుగా మారిపోయింది. "విలీనం" (శాసనసభా పక్షంలో మూడింట రెండు వంతుల మంది ఫిరాయించవలసి ఉంటుంది) అనే షరతును చాలా చాకచక్యంగా ఉపయోగ పెట్టుకుంటున్నారు. అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాల్సిన రాజ్యాంగ అధికారులయిన స్పీకర్లు, ఆ పిటిషన్లు తమ సొంత పార్టీకి ప్రయోజనం చేకూర్చేవయితే వాటి మీద ఎలాంటి నిర్ణయం ప్రకటించకుండా అసాధారణమైన కాలయాపనకు పూనుకుంటున్నారు. సుప్రీంకోర్టు ఈ ధోరణులను గమనించి, అసంతృప్తిని వ్యక్తం చేసి, ఆదేశాలు జారీ చేసినప్పటికీ---ఈ ధోరణిలో ఇప్పటికీ మార్పు లేదు, అలాగే కొనసాగుతోంది. నేడు ఫిరాయింపుల నిరోధక చట్టం అనేది పునాదులు తొలగించబడిన ఒక భవనం లాంటిది. కేవలం ముఖద్వారం మాత్రమే అగుపడతా ఉంటుంది.

**ప్రిసైడింగ్ అధికారులు, ఎన్నికల సంఘం - లొంగుబాటు సాధనం**

లోక్‌సభ స్పీకర్, గవర్నర్లు, భారత ఎన్నికల సంఘం (ఇ.సి.ఐ) వంటి రాజ్యాంగ పదవులు, రాజ్యాంగ వ్యవస్థలో సమతుల్యతను కాపాడేందుకు లేదా రెఫరీలుగా వ్యవహరించేందుకు రూపొందించబడ్డాయి. ఆటగాళ్లే రెఫరీలు కాకుండా నిలువరించేందుకు తగిన వ్యవస్థలుగా వీటిని తీర్చిదిద్దారు. అయితే ఇప్పుడు ఈ నమ్మిక సడలిపోయింది. తమిళనాడు, కేరళ, తెలంగాణ, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో గవర్నర్ల పక్షపాత పని తీరు గురించి కూలంకషంగా చర్చించడం, దానిని డాక్యుమెంట్ చేయడం జరిగింది. ఈ గవర్నర్లు రాజ్యాంగ సంక్షోభాలను సృష్టిస్తున్నారు, బిల్లులను తొక్కి పెడుతున్నారు. రాజ్యాంగ అధిపతులుగా తమ పాత్రను నిర్వర్తించకుండా కేంద్ర ప్రభుత్వం చేతిలో పావులుగా వ్యవహరిస్తున్నారు. వీరి పని తీరు చూస్తే రాజ్యాంగ పదవులను రాజకీయ సాధనాలుగా ఎలా వినియోగిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.ఎన్నికలను నిర్వహించే బాధ్యత కలిగిన ప్రిసైడింగ్, రిటర్నింగ్ అధికారుల పనితీరులో కూడా ఇదే ధోరణి కనిపిస్తుంది. మధ్యప్రదేశ్, జార్ఖండ్‌లలో జరిగిన రాజ్యసభ ఎన్నికలు, అలాగే చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో రిటర్నింగ్ అధికారి ఎన్నికల ప్రక్రియలో చట్ట విరుద్ధంగా జోక్యం చేసుకున్నట్లు సుప్రీంకోర్టు నిర్ధారించిన ఇటీవలి వివాదాలు, నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన అధికారుల తటస్థతపై తీవ్ర ఆందోళనలను రేకెత్తించాయి. నిష్పక్షపాతంగా ఉండాల్సిన రెఫరీలు కూడా పక్షపాత ప్రభావానికి లోనవుతున్నారనే వాస్తవాన్ని ఈ సంఘటనలు బలపరుస్తున్నాయి.ఎన్నికల సంఘం నడవడికపై ప్రత్యేక శ్రద్ధ అవసరం, ఎందుకంటే ఇ.సి.ఐ అనేది ఒక సాధారణ సంస్థ కాదు. ఎన్నికల ప్రజాస్వామ్యం మనుగడే దాని స్వతంత్రతపై ఆధారపడి ఉంటుంది. ఇటీవలి సంవత్సరాలలో దాని పనితీరు కేవలం విధానాలను ప్రస్తావించడం ద్వారా సమాధానం చెప్పలేని ప్రశ్నలను లేవనెత్తింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం మతపరమైన విజ్ఞప్తులుగా పరిగణించబడే ప్రసంగాలు చేసిన ప్రధానమంత్రి, హోంమంత్రిపై వచ్చిన ఫిర్యాదులపై చర్యలు తీసుకోవడానికి ఇ.సి.ఐ నిర్ద్వంద్వంగా నిరాకరించడం ఇందుకు అత్యంత స్పష్టమైన ఉదాహరణలలో ఒకటి. కాంగ్రెస్ "దేశ సంపదను చొరబాటుదారులకు పంచుతోంది" అని ప్రధానమంత్రి మాట్లాడినప్పుడు, "మంగళ సూత్రాలను" ప్రస్తావించినప్పుడు, అలాగే హోంమంత్రి మతపరమైన విభజనను సృష్టించే భాషను ఉపయోగించినప్పుడు కూడా ఇ.సి.ఐ ఎటువంటి ఉల్లంఘనను గుర్తించకపోవడం దాని పక్షపాత ధోరణిని స్పష్టం చేస్తుంది.

**ప్రధాన న్యాయమూర్తికి ఎంపిక కమిటీలో స్థానం లేదు**

మార్చి 2023లో, సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం అనూప్ బరన్వాల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో, ఎన్నికల సంఘం నియామకాలను ప్రధానమంత్రి, ప్రతిపక్ష నాయకుడు, భారత ప్రధాన న్యాయమూర్తిలతో కూడిన కమిటీ సలహాపై చేపట్టాలని ఆదేశించింది. నియామకాలను పూర్తిగా కార్యనిర్వాహక వర్గం చేతుల్లోనే వదిలేయడం "మన ప్రజాస్వామ్య ఆరోగ్యానికి తీవ్ర హానికరం" అని ఆ తీర్పు స్పష్టంగా పేర్కొంది. తమ అన్యాయమైన ప్రయోజనాలకు భంగం కలిగే అన్ని విషయాల లాగే, ఇక్కడ కూడా ప్రభుత్వ ప్రతిస్పందన వేగంగా వ్యూహాత్మకంగా మారింది. డిసెంబర్ 2023 నాటికి, పార్లమెంట్ చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఇతర ఎలక్షన్ కమిషనర్ల (నియామకం, సేవా నిబంధనలు-పదవీ కాలం) చట్టం, 2023 ను ఆమోదించింది. ఈ చట్టం భారత ప్రధాన న్యాయమూర్తి స్థానంలో ప్రధానమంత్రి నామినేట్ చేసిన ఒక క్యాబినెట్ మంత్రిని చేర్చింది. ఇప్పుడు ఆ ఎంపిక కమిటీలో ప్రధానమంత్రి, ప్రతిపక్ష నాయకుడితోపాటు ప్రధానమంత్రి ఎంచుకున్న ఒక మంత్రి ఉంటారు. అంటే మూడు ఓట్లలో రెండు ఓట్లు కార్యనిర్వాహక వర్గానికి చెందినవే.మెజారిటీ ప్రతిపక్ష సభ్యులు సస్పెన్షన్‌లో ఉన్న సమయంలోనే లోక్‌సభలో ఈ బిల్లు ఆమోదం పొందిందనే విషయాన్ని మనం ఇక్కడ గమనంలో ఉంచుకోవాలి. 2023 చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన కేసులు జనవరి 2024 నుండి సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి. స్టే మంజూరు కాలేదు. మే 2026 నాటికి, ఈ విషయం ఇంకా డివిజన్ బెంచ్ ముందు వాదనల్లో ఉంది. ఇద్దరు ప్రధాన న్యాయమూర్తులు ఈ ప్రక్రియ నుండి తప్పుకున్నారు. ఈ వివాదాస్పద చట్టం కింద నియమించబడిన ఎన్నికల కమిషనర్లు మాత్రం పదవిలో కొనసాగుతూ ఉన్నారు, ఎన్నికల చక్రం నడుస్తూనే ఉంది.

**ఆర్డినెన్స్ - జమ్మూ కాశ్మీర్ టెంప్లేట్**

రాజ్యాంగ ఉల్లంఘనకు సంబంధించిన మరో రెండు ఉదాహరణలను ఈ సందర్భంలో చెప్పుకోవాల్సి ఉంటుంది. ఎందుకంటే ఇవి తమకు నచ్చని న్యాయస్థాన తీర్పులను అధిగమించడానికి ఒక పద్ధతిని నిర్దేశిస్తాయి. ఢిల్లీ ఆర్డినెన్స్ మొదటి కేసు-మే 2023లో ఢిల్లీ ఎన్నికైన ప్రభుత్వానికి సేవలపై నియంత్రణను సుప్రీంకోర్టు పునరుద్ధరించడం. ఒక నగర-రాష్ట్ర ఎన్నికైన ప్రభుత్వాన్ని కేవలం ఒక నామమాత్రపు సంస్థగా కాకుండా అధికారయుత సంస్థగా మార్చడం అంటే అది రాజ్యాంగ ప్రజాస్వామ్యంలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన అంశం. అయితే కొద్ది రోజుల్లోనే కేంద్ర ప్రభుత్వం ఆ తీర్పు ప్రభావాన్ని రద్దు చేసేలా ఒక ఆర్డినెన్స్ రూపొందించింది. ఆ ఆర్డినెన్స్ తదనంతరం చట్టంగా ఆమోదం పొందింది. ప్రభుత్వం కోర్టు తీర్పును సవాలు చేయాల్సిన అవసరం లేకుండా, చట్ట సభలో కార్యనిర్వాహక వర్గానికి ఉన్న మొరటు బలంతో సుప్రీం తీర్పునకు విలువ లేకుండా చేసింది.జమ్మూ కాశ్మీర్ టెంప్లేట్ - అసెంబ్లీ లేని పరిస్థితిని ఉపయోగించుకుని ఆర్టికల్ 370 రద్దు, పూర్తి స్థాయి రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా మార్చడం అనేది కుయుక్తులతో కూడిన రాజ్యాంగ ఎత్తుగడల ద్వారా సాధించారు. ఈ కేంద్రపాలిత ప్రాంతాలలో ఒకటి లడఖ్, దీనికి అసెంబ్లీ కూడా లేదు. ఆర్టికల్ 356 కింద రాష్ట్రపతి ఉత్తర్వులను ఉపయోగించి ఆర్టికల్ 370లో సవరణలు చేశారు. దీనికి రాష్ట్ర రాజ్యాంగ అసెంబ్లీ ఆమోదం అవసరం. కానీ అది అప్పటికే ఉనికిలో లేదు. 'చట్ట సభ ఆమోదం' అన్న రాజ్యాంగ అవసరాన్ని రద్దు చేయడం ద్వారా ఆ షరతును అధిగమించారు. ఇది అధికార పార్టీ తన ఎజెండాను ముందుకు తీసుకెళ్లడానికి చట్టపరమైన లొసుగును సృష్టించి మరీ అప్రజాస్వామికంగా వ్యవహరించిన తెంపరితనానికి ఒక ఉదాహరణ.

ఎమ్. ఎ. బేబీ, సిపిఎం

## తెలంగాణ విద్యారంగానికి జాతీయ స్థాయిలో గుర్తింపు..

(మొదటి పేజీ తరువాయి)

సారించిన ప్రభుత్వం 120 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలను ఇంటర్ స్థాయికి అప్‌గ్రేడ్ చేసింది. మరో 93 కేజీబీవీలకు యంగ్ ఇండియా ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ ఎక్సలెన్స్ గుర్తింపు లభించింది. ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ ఫలితాల్లో తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ, గణిత విభాగాల్లో విద్యార్థులు మెరుగైన ప్రతిభ కనబరిచారు. సాంకేతిక విద్యకు ప్రాధాన్యం ఇస్తూ 1,132 పాఠశాలల్లో ×జు ల్యాబ్‌లు, 2,036 పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్, 4,249 ప్రాథమిక పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. అలాగే ఒకటో తరగతి నుంచి 9వ తరగతి వరకు కృత్రిమ మేధస్సు, డిజిటల్ లిటరసీ పాఠ్యాంశాలను ప్రవేశపెట్టారు. ఉపాధ్యాయుల నైపుణ్యాభివృద్ధి కోసం ఫిన్లాండ్, జర్మనీ దేశాలకు అధ్యయన పర్యటనలు కూడా నిర్వహించారు. ఈ చర్యల ఫలితంగా పదోతరగతి ఉత్తీర్ణత శాతం 95.15కు చేరుకోగా, రాష్ట్రవ్యాప్తంగా 5,731 ప్రభుత్వ పాఠశాలలు 100 శాతం ఫలితాలు నమోదు చేశాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో చేపట్టిన విద్యా సంస్కరణలకు జాతీయ స్థాయిలో ప్రశంసలు లభిస్తున్నాయని ప్రభుత్వం పేర్కొంది.

## పోలీసుల ఫిట్‌నెస్‌కు క్రీడలే బలమైన పునాది: డీజీపీ సి.వి. ఆనంద్

(మొదటి పేజీ తరువాయి)

**తొలిసారిగా ఐదు క్లస్టర్లలో..**

గత 35 ఏళ్లుగా రాష్ట్ర పోలీస్ క్రీడలను ఒకే వేదికపై నిర్వహించే ఆనవాయితీకి ఈ ఏడాది స్వస్తి పలికినట్లు డీజీపీ వెల్లడించారు. జాతీయ స్థాయి స్పోర్ట్స్ తరహాలో.. ఐదు క్లస్టర్లుగా విభజించి ఈ క్రీడలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మరింత మంది సిబ్బందికి క్రీడల్లో పాల్గొనే అవకాశం లభిస్తుందన్నారు. మొత్తం 21 జట్లతో 34 ఈవెంట్లలో పోటీలు జరగనున్నాయి. క్లస్టర్ ఏ పోటీలు జులై 7 నుంచి 9 వరకు సరూర్‌నగర్‌లో బాక్సింగ్, రెజ్లింగ్ తదితర 14 ఇండోర్ క్రీడలు, క్లస్టర్ బీ టీ20 క్రికెట్ పోటీలు నవంబర్ 17 నుంచి 19 వరకు ఫ్యూచర్ సిటీలో జరగనున్నాయి. క్లస్టర్ సీ పోటీలు టెన్నిస్, బ్యాడ్మింటన్ సెప్టెంబర్ 7 నుంచి 9 వరకు తెలంగాణ పోలీస్ అకాడమీలో, క్లస్టర్ డీ వాలీబాల్,కబడ్డీ నవంబర్ 3 నుంచి 5 వరకు, క్లస్టర్ ఈ సైక్లింగ్, ఆర్చరీ, రోయింగ్, నవంబర్ 25 నుంచి 28 వరకు నిజామాబాద్ కమిషనరేట్‌లో నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రత్యేక శిక్షణ, కోచింగ్ సదుపాయాలు కల్పిస్తామన్నారు. పోటీల్లో బంగారు పతకం సాధించిన వారికి రూ. 3 లక్షల నగదు బహుమతితో పాటు మూడు ప్రత్యేక ఇంక్రిమెంట్లు, వెండి పతకం సాధిస్తే రూ. 2 లక్షల నగదు, రెండు ప్రత్యేక ఇంక్రిమెంట్లు, కాంస్య పతకం నెగ్గితే రూ. లక్ష నగదు బహుమతి సహా ఒక ప్రత్యేక ఇంక్రిమెంట్‌ను అందజేస్తామని ప్రకటించారు.

**ఆపదలో ముందుగా గుర్తొచ్చేది పోలీసులే..**

ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన ప్రముఖ సినీ నటుడు నవీన్ పోలిశెట్టి మాట్లాడుతూ.. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు ముందుగా దేవుడు, ఆ తర్వాత పోలీసులే గుర్తుకు వస్తారని కొనియాడారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడా స్ఫూర్తితో పాల్గొనడమే ముఖ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి సీపీ సుమతి,హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్, ఐజీ గజారావు భూపాల్‌తో పాటు పలువురు సీనియర్ పోలీస్ అధికారులు, పోలీసు క్రీడాకారులు, పుల్లారెడ్డి మెమోరియల్ స్కూల్ విద్యార్థులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## తెలంగాణలో పెట్టుబడులకు కెనడా ఆసక్తి..

(మొదటి పేజీ తరువాయి)

నిలి గిల్బర్ట్ : బ్రూక్‌ఫీల్డ్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ బోర్డు సలహాదారు, మహేశ్ కొండూరు: అమెరికా ప్రభుత్వ సలహాదారు మొమెంటం టెక్నాలజీస్ సీఈఓ, అమిత్ మెహ్రా : ఆక్సన్ టెక్నాలజీస్ సీఈఓ, దిలెక్ , నార్వే మాజీ స్టేట్ సెక్రటరీ, థామస్ ఫ్రోలిక్, దక్షిణాఫ్రికా పార్లమెంట్ సభ్యుడు, సెంథిల్ తొండమాన్, సిలోన్ వర్కర్స్ కాంగ్రెస్ అధ్యక్షుడు( శ్రీలంక) సీఎంని కలిసిన వారిలో ఉన్నారు.

## పీఎఫ్ ఖాతాదారులకు కేంద్రం తీపికబురు: రూ.5 లక్షల వరకు ‘ఆటో క్లెయిమ్’

నిర్భయవార్త ప్రతినిధి : హైదరాబాద్ :




దేశంలోని కోట్ల మంది ప్రావిడెంట్ ఫండ్ ఖాతాదారులకు కేంద్ర ప్రభుత్వం తీపికబురు చెప్పింది. పీఎఫ్ విత్‌డ్రా ప్రక్రియను మరింత సులభతరం చేస్తూ ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ లో విప్లవాత్మక మార్పులను ప్రవేశపెట్టింది. ఇకపై ఎలాంటి ఆలస్యం లేకుండా రూ.5 లక్షల వరకు ఉ ండే పీఎఫ్ క్లెయిమ్‌లను ఆటో క్లెయిమ్ సెటిల్‌మెంట్ పద్ధతి ద్వారా ఆటోమేటిక్‌గా ఆమోదించేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే, అందుకు సంబంధించిన ఈపీఎఫ్‌వో కొత్త డిపాజిట్ వ్యవస్థ నేటి నుంచే అధికారికంగా ప్రారంభమైంది.

**ఒకే డేటాబేస్.. మరింత వేగంగా పీఎఫ్ సేవలు**

అయితే, కొత్తగా చేపట్టిన టెక్నికల్ మార్పుల వల్ల ఇక నుంచి పీఎఫ్ సేవలు శరవేగంగా సాగనున్నాయి. ఇది వరకు క్లెయిమ్ సెటిల్‌మెంట్‌కు వారాల తరబడి వేచి చూడాల్సి రాగా.. ఇకపై రోజుల్లోనే పని పూర్తి కానుంది. అదేవిధంగా దేశవ్యాప్తంగా ఉన్న ఖాతాదారులందరి పీఎఫ్ వివరాలను ఒకే కేంద్రీకృత డేటాబేస్ పరిధిలోకి తీసుకువచ్చారు. దీంతో ఉద్యోగులు దేశంలో ఎక్కడి నుంచైనా తమ పీఎఫ్ వివరాలను ఒకే చోట సులభంగా చూసుకోవచ్చు. జూలై 15 నాటికి ఖాతాల్లో జమ అయిన మొత్తానికి ప్రభుత్వం అందించే పీఎఫ్ వడ్డీ జమ చేసే ప్రక్రియ కూడా ప్రారంభం కానుంది.

## ధరణి, భూభారతి అక్రమాల డైవర్షన్ కే కాళేశ్వరం డ్రామా: రామచందర్ రావు

నిర్భయవార్త ప్రతినిధి :హైదరాబాద్ :

ధరణిలో అక్రమాలు నిజమేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు. ధరణితో పాటు



భూభారతిలోనూ అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ధరణితో పాటు భూభారతిపైనా సిట్ విచారణ జరగాలని డిమాండ్ చేశారు. బుధవారం బీజేపీ స్టేట్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన.. ధరణి, భూభారతి అవకతవకలు బయటపడుతున్నాయనే కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి కన్నెపల్లి అంశాన్ని తెరపైకి తీసుకువచ్చి ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. ఇది కాళేశ్వరం, కూలేశ్వరం కాదు ఈ రెండు పార్టీలు కలిసి చేస్తున్న డ్రామేశ్వరం అని ఎద్దేవా చేశారు. డైవర్షన్ పాలిటిక్స్ కోసమే కాళేశ్వరం అంశాన్ని తెరపైకి తీసుకువచ్చారన్నారు. ఎన్డీఎస్ఏ రిపోర్టే బీజేపీ విధానం అన్నారు. ఇకనైనా రాజకీయాలు పక్కన పెట్టి అవసరమైన మరమ్మతులు చేపట్టాలన్నారు. రాజకీయాల కోసం రైతులను ఇబ్బంది పెట్టవద్దన్నారు.

**బీజేపీ కృషితోనే తాటిచర్ల-2 గని:**

కేంద్ర ప్రభుత్వం ఎలాంటి వేలం లేకుండానే తాటిచర్ల-2 బొగ్గు గనిని సింగరేణికి కేటాయించిందని చెప్పారు. సింగరేణి విషయంలో ఎప్పుడైనా బీజేపీ ప్రభుత్వాలే కాపాడాయి తప్ప కాంగ్రెస్, బీఆర్ఎస్ ఏమి చేయలేదన్నారు. ఈ బ్లాక్ ద్వారా సంస్థకు రూ.64 వేల కోట్ల ఆదాయంతో పాటు 1200 అదనపు ఉద్యోగాలు రాబోతున్నాయన్నారు. తాటిచర్ల-2 తమ ప్రయత్నం చెప్పుకుంటున్న కాంగ్రెస్ చెప్పుకుంటోందని ఇదే నిజం అయితే మన్ మోహన్ సింగ్ హాయంలో ఎందుకు రాలేదన్నారు. ఈ గని రావడం వెనుక కేంద్రప్రభుత్వం, కిషన్ రెడ్డి కృషి ఉ ందన్నారు. తాటిచర్ల గనిని కేటాయించినందుకు కేంద్ర ప్రభుత్వానికి కిషన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

## అప్పుడు మంత్రివి, మేస్త్రివి అన్నీ నువ్వే కదా

### హరీష్ రావుకు జగ్గారెడ్డి కౌంటర్



నిర్భయవార్త ప్రతినిధి : హైదరాబాద్ :

కాళేశ్వరంపై పొలిటికల్ గేమ్ నడుస్తుందని, తెలంగాణ రైతులపై ఏదో బీఆర్ఎస్ నేతలకే ఎక్కువ ప్రేమ ఉన్నట్టు, సీఎం రేవంత్ రెడ్డి ఏమీ చేయడం లేదన్నట్టు హరీష్ రావు రోజూ మాట్లాడుతున్నారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మండిపడ్డారు. బుధవారం గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడిన జగ్గారెడ్డి.. కాళేశ్వరం విషయంలో మాజీ మంత్రి హరీశ్ రావుకు కౌంటర్ ఇచ్చారు. ‘కాళేశ్వరం ప్రాజెక్టుకు సిమెంట్, ఇసుక కలిపింది నువ్వే, ఇటుకలు పేర్చింది నువ్వే. ఇరిగేషన్ శాఖా మంత్రిగా అక్కడ రాత్రిపూట మంచం వేసుకుని పడుకున్నానని చెప్పుకున్నది నువ్వే. మీరు కట్టిన ప్రాజెక్టు మీ హయాంలోనే కూలిపోతే దానికి బాధ్యులు మీరా? లేక ఇప్పుడు అధికారంలోకి వచ్చిన మా కాంగ్రెస్ ప్రభుత్వమా?’ అని ప్రశ్నించారు. నాడు రేవంత్ సీఎంగా రేవంత్ రెడ్డి ఉన్నారా లేక మంత్రిగా ఉత్తమ్ ఉన్నారా అని నిలదీశారు. పదే పదే కాంగ్రెస్?ను బ్లేమ్ చేసే పని మానుకోవాలన్నారు.

**ముందు కేసీఆర్‌ను తీసుకుని రా..**

బీఆర్ఎస్ టార్గెట్ రేవంత్ రెడ్డి అని అసెంబ్లీ ఉన్నప్పుడు మాత్రం కేసీఆర్ రారన్నారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి మాట్లాడండి అని సీఎం రేవంత్ అడుగుతున్నా ఎందుకు రావడం లేదని నిలదీశారు. హరీశ్ రావు మీ మామను తీసుకుని రా సీఎం అసెంబ్లీ సమావేశం పెడుతారని ఆ సమావేశానికి ఎన్?డీఎస్ఏ ను కూడా పిలుద్దామని అందరి వాదనలు ప్రజలు వింటారన్నారు. సీఎం సవాల్ ను స్వీకరించి.. కేసీఆర్ ను తీసుకుని రావాలన్నారు. రేవంత్ రెడ్డి స్థాయికి. .కి మేం చాలు అనే సినిమా డైలాగులు వద్దని అసలు నీ కెపాసిటీ ఏంటి? రేవంత్ రెడ్డి పర్సనాలిటీ కంటే నీ పర్సనాలిటీ పెద్దదా? అని నిలదీశారు. నేను మున్సిపల్ చైర్మన్ గా ఉ న్నప్పుడు ...కాలేజీ?లో చదువుకుంటున్నావని గుర్తు చేశారు.

**దానికి సమాధానం చెప్పు:**

మంగళవారం కేసీఆర్ ఇరిగేషన్ మంత్రిగా ఎందుకు తొలగించారో హరీశ్ రావు సమాధానం చెప్పాలన్నారు. నువ్వు కాళేశ్వరంలో తప్పులు చేశావ్ కాబట్టే కేసీఆర్ తప్పించారన్నారు. డ్యామ్ సేఫ్టీ అథారిటీ కాంగ్రెస్ ది కాదని అది కేంద్ర ప్రభుత్వ సంస్థ అన్నారు. అక్కడ నీళ్ళు నిలువ ఉ ంచవద్దని ఒక వేళ నీళ్లు నిల్వ చేస్తే భద్రాచలంకొట్టుకుపోతుంది అని హెచ్చరించిందన్నారు. ఖమ్మం కొట్టుకు పోయినా ఫరవాలేదా? హరీష్ అని ప్రశ్నించారు. ఖమ్మం ప్రజలు అక్కర లేదా? నీళ్లు ఆపడం వల్ల జరిగే ప్రమాదం కూడా ప్రజలు ఆలోచన చేయాలన్నారు. హరీశ్ రావు మంత్రిగా ఫెయిల్ అయ్యారని అందుకే కాళేశ్వరం కుంగింది..కూలిందన్నారు.

**అందుకే కూలింది..**

నువ్వు చేసిన కథకు... రేవంత్ రెడ్డి మీద పడితే ఏం లాభం? నీళ్లు స్టోరేజీ పెట్టొద్దు కానీ గత ప్రభుత్వం పెట్టిందని అందుకే కూలిందన్నారు. రేవంత్..ఇంకో ఐదేళ్లు సీఎం మేమే అంటున్నారు కాబట్టి ఆందోళనలో దీ=ూ ఉందన్నారు. దొంగ మాటలు...దొంగ ముచ్చట్లు చెప్పడంలో కేసీఆర్ ఫ్యామిలీ ఎక్స్పర్ట్ అని విమర్శించారు. కేసీఆర్ కుటుంబం చెప్పే మాటలు నమ్మవొద్దని దొంగ మాటలు....దొంగ రాజకీయాలు ఆపకపోతే ఊరుకోమని హెచ్చరించారు. హరీష్ రావు నోటి మాటలే కాబట్టి ఏదైనా చెప్తాడు కూలీ పోతే బాధ్యత ఆయనకు ఉంటుందా అని నిలదీశారు. నీళ్ళు ఇవ్వలేదని రేవంత్ ను ఉరి వేయాలని అడుగుతున్నారు. మరి డ్యామ్ కూలిపోవడానికి కారణం అయిన మిమ్మల్ని ఏం చేయాలని ప్రశ్నించారు.

## మీరు ఇవ్వలేదు.. మేమే కొట్లాడి తెచ్చుకున్నాం..

### తాడిచెర్ల బ్లాక్-2 పై భట్టి కీలక వ్యాఖ్యలు

నిర్భయవార్త ప్రతినిధి :హైదరాబాద్ :

తెలంగాణ రాజకీయాల్లో తాటిచెర్ల కోల్ బ్లాక్-2 విషయంలో వార్ మొదలైంది. తాడిచెర్ల-2 కోల్ సింగరేణి కి కేటాయించామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు తాజాగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కౌంటర్ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఎలాంటి వేలం లేకుండానే తాటిచర్ల-2 బొగ్గు గనిని సింగరేణికి కేటాయించిందని బీజేపీ చేస్తున్న వాదనను భట్టి ఖండించారు. దీంతో తాజాగా కోల్ బ్లాక్ పై బీజేపీ, కాంగ్రెస్ మధ్య కోల్డ్ వార్ మొదలైంది.

**కొత్తగా మీరు చేసిందేంటి?**

బుధవారం మీడియాతో మాట్లాడిన భట్టి విక్రమార్క.. సింగరేణికి తాడిచర్ల-2 కేటాయింపు సంతోషకరం అని కానీ కిషన్ రెడ్డి వాస్తవాలు దాస్తున్నారని మండిపడ్డారు. వాస్తవాలను మరుగునపరిచి తప్పుదోవ పట్టించడం సరికాదన్నారు. ఈ బ్లాక్‌ను 2013లో నాటి యూపీఏ ప్రభుత్వం సింగరేణి కాలరీస్ కు కేటాయించిందని ఇందులో బీజేపీ ప్రభుత్వం కొత్తగా అలాట్ చేసిందేంటని ప్రశ్నించారు. అయితే గతంలోనే కేటాయిస్తే 2013 నుంచి ఇప్పటి వరకు పెండింగ్ పెట్టారన్నారు. బ్లాక్ కేటాయింపు జరిగింది.. మైనింగ్ లీజు కోసం అనుమతి ఇవ్వలేదన్నారు.

**తెలంగాణపై ప్రేమ ఉండే ఆ పని చేయండి:**

కొత్త యాక్ట్ ప్రకారం తాడిచర్ల -2 సింగరేణికి ఇవ్వబోమని చెప్పారు.




కానీ యాక్ట్ రావడానికి ముందే సింగరేణికి తాడిచర్ల-2 కేటాయించారనే ఈ విషయాలను మేము అధికారంలోకి వచ్చాక ప్రధాని, కేంద్ర మంత్రులను కలిసి వాస్తవాలను వారి ముందు ఉంచామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొట్లాడి అనుమతులు తెచ్చిందని ఇప్పటికైనా అనుమతులు ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణపై నిజంగా బీజేపీకి ప్రేమ ఉంటే సింగరేణి పరిధిలోని గనులన్నీ సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు.

## రేవంత్, ఉత్తమ్‌ని ఉరితీసినా తప్పులేదు: హరీష్‌రావు



నిర్భయవార్త ప్రతినిధి : హైదరాబాద్ :

ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలతో తెలంగాణలో చెరువులు నింపేందుకు అవకాశం ఉన్నా.. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర ఆరోపణలు చేశారు. బుధవారం నగరంలోని తెలంగాణ భవన్‌లో కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. వరంగల్ జిల్లాలో వర్షాలు లేక దాదాపు 90 శాతం చెరువులు ఎండిపోయాయని హరీశ్ రావు అన్నారు. అయినా మోటార్లు ఆన్ చేయకుండా.. నీళ్లను దుర్మార్గంగా దిగువకు వదులుతున్నారని కామెంట్ చేశారు. పొరుగున ఉన్న చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లించేందుకే రేవంత్ రెడ్డి నీళ్లను యథేచ్ఛగా వదులుతున్నారని సెటైర్లు వేశారు. నదులలో నీళ్లు ఉండి కూడా.. మోటార్లతో లిఫ్ చేయకపోవడం క్రిమినల్ నెగ్లిజెన్స్ కిందకు వస్తుందని.. రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డిని ఉరి తీసినా తప్పులేదని హరీశ్ రావు ధ్వజమెత్తారు. నీళ్ల మంత్రిగా ఉ త్తమ్, ముఖ్యమంత్రిగా రేవంత్ ఇద్దరూ ఫెయిల్ అయ్యారంటూ కామెంట్ చేశారు.

**రేవంత్.. అబద్ధాల్లో ‘నోబెల్ ప్రైజ్’ నీకే!**

సాధారణంగా దేవాదుల మోటర్లు 71 మీటర్ల నీళ్ళు ఉంటే పనిచేస్తాయని, కానీ ఇప్పుడు 75 మీటర్ల నీళ్లు ఉన్నాయని హరీశ్ రావు తెలిపారు. అంటే నీళ్లు ఉండి కూడా కావాలని ఎత్తిపోయడం లేదని.. దేవాదుల ప్రాజెక్టులో సగానికి పైగా మోటర్లు అసలు ఆన్ చేయలేదని పేర్కొన్నారు. కట్టిన ఇళు .. పెట్టిన పొయ్యి లాగా కేసీఆర్ అన్న చేశారని.. అయినా చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ చేయట్లేదని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. అబద్ధాలు చెప్పే విషయంలో రేవంత్ రెడ్డికి నోబెల్ ప్రైజ్ వస్తుందని సెటైర్లు వేశారు. సీఎం నిన్న చెప్పిన ప్రతి ఒక్క అబద్ధానికి.. ఒక్కొక్క అక్షరానికి సమాధానం చెబుతానని అన్నారు. అయినా, కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో ఈ ప్రభుత్వం నెగెటివ్ మైండ్ సెట్‌తో ఉందన్నారు. మేడిగడ్డ విషయంలో కుంటిసాకులు చెబుతన్నారని.. దేవాదుల నీటిని ఎందుకు ఎత్తిపోయడం లేదని హరీశ్ అన్నారు. తమ్మిడిహట్టి వద్ద 152 మీటర్లకు మహారాష్ట్ర ఒప్పుకున్నట్లుగా డాక్యుమెంట్ ఉ ంటే రేవంత్ రెడ్డి బయటపెట్టాలని.. అలా చేస్తే తాను తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ఓపెన్ ఆఫర్ ఇచ్చారు. లేనిపక్షంలో ప్రజల ముందుకు వచ్చి ఇదే రేవంత్ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని హరీశ్ రావు సవాల్ విసిరారు.

## సూర్యాపేటలో కాంగ్రెస్ నేతల మధ్య ఘర్షణ.. పోలీసుల లాఠీఛార్జి

నిర్భయవార్త ప్రతినిధి :సూర్యాపేట :

జిల్లా కాంగ్రెస్ పార్టీలో గ్రూప్ వివాదాలు ఒక్కసారిగా బహిర్గతమయ్యాయి. అర్వపల్లిలో కాంగ్రెస్ పార్టీ నాయకుల మధ్య ఘర్షణ ఉద్రిక్తతకు దారి తీసింది. ఛలో గాంధీభవన్ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీలోని అసంతృప్తి నేతలు పిలుపునిచ్చారు. దీంతో వారిని ఎమ్మెల్యే వర్గీయులు అడ్డుకున్నారు. ఇరు వర్గాలు రాళ్లు, కర్రలతో దాడులు చేసుకున్నారు. వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని అదుపుచేసేందుకు ఇరువర్గాలపై లాఠీఛార్జి చేశారు. సూర్యాపేట జిల్లాలోని తుంగతుర్తి నియోజకవర్గంలో ఇటీవల ప్రకటించిన తొమ్మిది మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులను మార్చాలంటూ ఎమ్మెల్యే అసంతృప్తి వర్గం నేతలు బుధవారం ఛలో గాంధీభవన్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో అర్వపల్లి చౌరస్తాకు వారి వాహనాలు చేరుకోగానే ఎమ్మెల్యే వర్గీయులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఒకరిపై ఒకరు రాళ్లు, కర్రలతో దాడులకు దిగారు.

దీంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ దాడుల్లో రెండు కార్ల అద్దాలు ధ్వంసమయ్యాయి. పోలీసులు రంగప్రవేశం చేసి వారందరినీ చెదరగొట్టినప్పటికీ మరోసారి రాళ్లు, కర్రలతో దాడులు చేసుకుంటూ ఘర్షణ వాతావరణం సృష్టించారు. చివరకు పోలీసులు లాఠీఛార్జి చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఇరువర్గాలపై పోలీసులు కేసులు నమోదు చేశారు.

# భద్రాచలం ఖూచీ బ్యాంక్ మేనేజర్ పేరిట ఘరానా టోకరా

## పేద గిరిజన మహిళలను నమ్మించి, రూ. లక్షల్లో దండుకున కిలాడీ లేడీ!
## తక్కువ వడ్డీకే గ్రూప్ లోన్లు ఇప్పిస్తామంటూ బురిడీ!
## అశ్వారావుపేట మండలం వాగుడ్డుగూడెం లో వెలుగుచూసిన భారీ మోసం.
## బాధితుల ఫోన్లు బ్లాక్ చేసి, నిందితురాలు పరార్..
## న్యాయం చేయాలంటూ పోలీసులను ఆశ్రయించిన బాధితులు.




అశ్వారావుపేట, జూలై 9 (నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి)రెక్కాడితే గాని డొక్కాడని పేద గిరిజన మహిళల అమాయకత్వాన్ని, ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుని ఒక కిలాడీ లేడీ భారీ వంచనకు పాల్పడింది. “మీకు తక్కువ వడ్డీకే రూ. 50,000 చొప్పున గ్రూప్ లోన్లు ఇప్పిస్తా... నా భర్త భద్రాచలంలో ఖూచీ బ్యాంక్ మేనేజర్” అంటూ నమ్మబలికి, సుమారు 35 మంది మహిళల నుండి లక్షలాది రూపాయలు వసూలు చేసి రాత్రికి రాత్రే పరారి ఘటనా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలో కలకలం రేపింది.

**అసలేం జరిగిందంటే..?**

బాధితులు పోలీసులకు సమర్పించిన లిఖితపూర్వక ఫిర్యాదు ప్రకారం... అశ్వారావుపేట మండలం, ఊట్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని వాగుడ్డు గూడెం గ్రామానికి చెందిన పేద గిరిజన మహిళల వద్దకు రమణక్కపేట గ్రామ వాస్తవ్యురాలు, ప్రస్తుతం నారంవారిగూడెం కాలనీలో నివసిస్తున్న సోడం రాధ అనే మహిళ వచ్చింది. తన భర్త మునుగొండ. శేషు భద్రాచలంలోని ఖూచీ బ్రాంచ్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్నాడని పరిచయం చేసుకుంది. తమ బ్యాంక్ ద్వారా మహిళలకు అతి తక్కువ వడ్డీకే గ్రూప్ లోన్లు ఇప్పిస్తామని నమ్మబలికింది. ఆమె మాటలు నమ్మిన వాగొడ్డుగూడెం గ్రామానికి చెందిన సుమారు 35 మంది మహిళలు లోన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో రాధ ఒక్కొక్కరి నుండి మొదటి విడతగా రూ. 1000, ఆ తర్వాత రూ. 3000, ఆపై డాక్యుమషన్, ఓటర్ లిస్ట్ ఖర్చుల పేరిట మరో రూ. 950 చొప్పున వసూలు చేసింది. రూ. 50,000 లోన్ రావాలంటే అడ్వాన్స్ మరియు వడ్డీ షేర్ కింద 10% కట్టాలని చెప్పి పెద్ద మొత్తంలో డబ్బులు గుంజింది.

**ఫోన్ స్విచ్ఛాఫ్.. అడిగితే బెదిరింపులు!**

ఈ నెల జూలై 6న లోన్ అమౌంట్ ఇస్తానని నమ్మబలికిన రాధ, ఆ తర్వాత నుండి తన మొబైల్ ఫోన్ స్విచ్ఛాఫ్ చేసింది. దీంతో ఆందోళనకు గురైన బాధితులు కే. అంగమ్మ, కే. నాగదుర్గ, కే. రామకృష్ణ, ఎం. వీరమ్మ, కే. రాధ, కే. సావిత్రి తదితరులు కలిసి నారంవారిగూడెంలోని ఆమె నివాసానికి వెళ్లి వెతికారు. అయితే అప్పటికే ఆమె అక్కడి నుండి పరారైనట్లు తెలిసింది. ఈ విషయమై ఆమె భర్త మునుగొండ. శేషును నిలదీయగా.. వారు బాధితుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ, తీవ్ర పదజాలంతో దూషిస్తూ, బెదిరింపులకు దిగినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. మాకు న్యాయం చేయండి, బాధితుల ఆక్రందన కూలీ నాలీ చేసుకునే తమ నోటికాడి కూడును లాక్కుని, లోన్ల పేరిట ఆశ చూపి నిలువునా ముంచేసిన కిలాడీ లేడీ సోడం రాధ, ఆమెకు సహకరించిన భర్త మునుగొండ.శేషు పై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. అశ్వారావుపేట పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌ను కలిసి బాధితులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. పోలీసులు తక్షణమే స్పందించి తమకు రావలసిన డబ్బులను రికవరీ చేసి, నిందితులను కఠినంగా శిక్షించాలని బాధితులు కన్నీరుమున్నీరవుతూ వేడుకుంటున్నారు.

# గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు నియోజకవర్గాల వారీగా శిక్షణ..

### జూలై 9, 10 తేదీల్లో మూడు కేంద్రాల్లో నిర్వహణ : డీఆర్‌డీఓ విద్యాచందన

భద్రాచలం జూలై 8 నిర్భయ వార్త ప్రతినిధి గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక (జీపీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక) రూపకల్పన, అమలుపై జిల్లాలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు నియోజకవర్గాల వారీగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విద్యాచందన ఒక ప్రకటనలో తెలిపారు.జూలై 9, 2026న ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు కొత్తగూడెం క్లబ్లో కొత్తగూడెం, ఇల్లందు, వైరా నియోజకవర్గాలకు చెందిన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే రోజు భద్రాచలంలోని వీరభద్ర ఫంక్షన్ హాల్లో భద్రాచలం, పినపాక నియోజకవర్గాలకు చెందిన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ నిర్వహించనున్నట్లు తెలిపారు జూలై 10, 2026న ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు పట్వారిగూడెంలోని చలికాని ఆదమ్మ ఫంక్షన్ హాల్లో అశ్వారావుపేట నియోజకవర్గానికి చెందిన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక తయారీ, గ్రామ అవసరాల గుర్తింపు, ప్రాధాన్యతల నిర్ణయం, అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పన, ప్రభుత్వ మార్గదర్శకాల అమలుపై ఈ శిక్షణలో అవగాహన కల్పించనున్నట్లు డీఆర్‌డీఓ విద్యాచందన తెలిపారు. సంబంధిత నియోజకవర్గాలకు చెందిన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు నిర్ణీత తేదీ, సమయానికి ఆయా శిక్షణా కేంద్రాలకు తప్పనిసరిగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు..



# డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ఆశయాల సాధనకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది: బండి రమేష్

కూకట్‌పల్లి, జూలై 8 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: దివంగత మహానేత, మాజీ ముఖ్యమంత్రి డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఘనంగా నివాళి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. గాయత్రి నగర్‌లో మస్తాన్ రెడ్డి ఆధ్వర్యంలో, అల్లాపూర్‌లో వాజిద్ పాషా ఆధ్వర్యంలో, కేపీహెచ్‌బీలో సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో, ప్రశాంత్ నగర్‌లో నాగార్జున, రమణ ఆధ్వర్యంలో, ఆంజనేయ నగర్‌లో శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి కార్యక్రమాల్లో బండి రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించి కోట్లాది ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానేత డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. రైతులు, పేదలు, మహిళలు, విద్యార్థులు, వృద్ధులు, నిరుపేద కుటుంబాల సంక్షేమం కోసం ఆయన ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ, 108 అంబులెన్స్ సేవలు, జలయజ్ఞం, ఉచిత విద్యుత్, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇందిరమ్మ గృహాలు వంటి సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని పేర్కొన్నారు.ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు చేపట్టిన చారిత్రాత్మక పాదయాత్ర ద్వారా డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి నిజమైన ప్రజానాయకుడిగా నిలిచారని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లే బాధ్యత కాంగ్రెస్ పార్టీపై ఉందన్నారు. రాష్ట్రంలో ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని, మహానేత చూపిన మార్గంలోనే ప్రజాసేవ కొనసాగిస్తామని బండి రమేష్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు, యువజన నాయకులు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డికి ఘన నివాళులర్పించారు








# డేటా ఆధారిత ట్రాఫిక్ నిర్వహణకు సైబరాబాద్ పోలీసుల కార్యాచరణ

### ట్రాఫిక్ జోన్ అధికారులతో జాయింట్ సీపీ సన్‌ప్రీత్ సింగ్ సమీక్ష -- కార్‌పూలింగ్ ప్రోత్సాహం, డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కఠిన చర్యలకు ఆదేశాలు



సైబరాబాద్, జూలై 8 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ రద్దీని శాస్త్రీయంగా నియంత్రించేందుకు డేటా ఆధారిత కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని సైబరాబాద్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్) సన్‌ప్రీత్ సింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ప్రధాన కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్‌లో శేరిలింగంపల్లి ట్రాఫిక్ జోన్ పరిధిలోని పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా జాయింట్ సీపీ మాట్లాడుతూ, ట్రాఫిక్ నిర్వహణను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర సర్వేలు నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా వివిధ సంస్థలు, కంపెనీల నుంచి ఏయే సమయాల్లో ఎన్ని వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయనే అంశాలపై వారం రోజుల పాటు సమయాల వారీగా వాహనాల లెక్కింపు చేపట్టాలని ఆదేశించారు. ఈ సర్వే ద్వారా ఉదయం, సాయంత్రం పీక్ అవర్స్‌లో ట్రాఫిక్ తీవ్రతపై స్పష్టమైన అవగాహన ఏర్పడుతుందని తెలిపారు.ఐటీ కారిడార్‌లో కార్‌పూలింగ్‌ను ప్రోత్సహించే చర్యలు తీసుకోవడంతో పాటు వాహనాల వర్గీకరణ, ట్రాఫిక్ వాల్యూం, రహదారుల సామర్థ్యంపై సమగ్ర విశ్లేషణ నిర్వహించాలని అధికారులకు సూచించారు.ప్రధాన కూడళ్లు, ముఖ్య రహదారుల్లో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల పనితీరును సమీక్షించి, అవి సమర్థవంతంగా పనిచేస్తున్నాయా అనే అంశాన్ని పరిశీలించాలని తెలిపారు. కెమెరాల జియో–ట్యాగింగ్, అవసరమైన చోట హై–రిజల్యూషన్ కెమెరాల ఏర్పాటు, సిగ్నల్ అబ్స్ట్రాక్ట్‌లు, పెలికాన్ సిగ్నల్స్, జంక్షన్ల నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. షాపింగ్ మాల్స్, హోటళ్లు, ఆసుపత్రులు, విద్యాసంస్థల వద్ద ట్రాఫిక్ పరిస్థితులను అధ్యయనం చేసి, రద్దీ సమయాల్లో ట్రాఫిక్‌ను సాఫీగా సాగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే విద్యాసంస్థల ప్రారంభ, ముగింపు సమయాల్లో విద్యార్థుల ప్రయాణ విధానం, దాని ప్రభావంపై కూడా విశ్లేషణ చేయాలని సూచించారు.ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై ఎలాంటి రాజీ లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని జాయింట్ సీపీ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో శేరిలింగంపల్లి ట్రాఫిక్ డీసీపీ రవికుమార్, ట్రాఫిక్ అదనపు డీసీపీ హనుమంతరావు, ట్రాఫిక్ అడ్మిన్ అదనపు డీసీపీ నరేందర్, ఎస్‌సీఎస్‌సీ సీఈఓ నవేద్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# మీసేవ కేంద్రాల్లో నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలి: అదనపు కలెక్టర్ వేణుగోపాల్.

భద్రాచలం జూలై 8 నిర్భయ వార్త ప్రతినిధి మీసేవ కేంద్రాల ద్వారా ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన, నాణ్యమైన సేవలు అందించాలంటే ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను ప్రతి కేంద్రంలో కచ్చితంగా అమలు చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ ఆదేశించారు.బుధవారం బూర్గంపాడు మండల తహసీల్దార్ కార్యాలయంలో మీసేవ కేంద్రాల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌తో పాటు తహసీల్దార్ ప్రసాద్ , మండలంలోని గ్రామ పంచాయతీ అధికారులు (జీపీఓలు), రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు (ఆర్‌ఐలు), మీసేవ కేంద్రాల వీఎల్‌ఈలు, ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్ సైదేశ్వరరావు , జిల్లా మేనేజర్ కృష్ణమూర్తి పాల్గొన్నారు. అనంతరం భద్రాచలం మండలంలో కూడా ఇదే అంశాలపై తహసీల్దార్, జీపీఓలు, ఆర్‌ఐలు, మీసేవ కేంద్రాల వీఎల్‌ఈలు, ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్, జిల్లా మేనేజర్ కృష్ణమూర్తితో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, మీసేవ కేంద్రాలు నిర్ణయించిన పని వేళలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. దరఖాస్తుదారుల నుంచి అవసరం లేని భౌతిక పత్రాలను మండల రెవెన్యూ కార్యాలయాలు కోరకూడదని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన డిజిటల్ రసీదుల విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, కాగితపు రసీదులకు బదులుగా దరఖాస్తుదారుల మొబైల్‌కు రసీదు సందేశం పంపించి, అవసరమైతే ఈ–ప్రింట్ సౌకర్యాన్ని కల్పించాలని తెలిపారు.ప్రభుత్వం నిర్ణయించిన సేవా రుసుములకు మించి ఎట్టి పరిస్థితుల్లోనూ అదనపు మొత్తాలు వసూలు చేయరాదని హెచ్చరించారు. దరఖాస్తులకు సంబంధించిన చెల్లుబాటు అయ్యే పత్రాలను మాత్రమే అప్లోడ్ చేయాలని, ప్రతి పత్రాన్ని స్పష్టంగా స్కాన్ చేసి నాణ్యతతో అప్లోడ్ చేయాలని సూచించారు. ప్రతి మీసేవ కేంద్రంలో రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.ప్రజలు ప్రభుత్వ సేవల కోసం మీసేవ కేంద్రాలను ఆశ్రయిస్తారని, వారితో మర్యాదపూర్వకంగా, గౌరవప్రదంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారదర్శకత, బాధ్యతతో సేవలు అందించడం ద్వారా ప్రభుత్వంపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తెలిపారు.ఈ సమావేశాల్లో తహసీల్దార్లు, గ్రామ పంచాయతీ అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, మీసేవ కేంద్రాల వీఎల్‌ఈలు, ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్ సైదేశ్వర రావు , జిల్లా మేనేజర్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు..



# ఆన్‌లైన్ యాప్ ద్వారానే ఎరువుల కొనుగోళ్లు చేయాలి

### కలెక్టర్ మను చౌదరి

శామీర్‌పేట, జూలై 8 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: మేడ్చల్––మల్కాజిగిరి జిల్లాలో పైలట్ ప్రాతిపదికన అమలు చేస్తున్న ఆన్‌లైన్ ఎరువుల కొనుగోలు విధానాన్ని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి బుధవారం శామీర్‌పేటలోని షేక్ చాంద్ ఎరువుల దుకాణంలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ‘ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫెర్టిలైజర్’ (ఫ్రేమవర్క్ ఫర్ ఫర్టిలైజర్ ) యాప్ పనితీరును కలెక్టర్ పరిశీలించి, రైతులు ఆన్‌లైన్ ద్వారా ఎరువులను ఎలా బుక్ చేసుకుంటున్నారనే ప్రక్రియను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ప్రతి రైతు ఇకపై ఈ యాప్ ద్వారానే ఎరువులను కొనుగోలు చేయాలని, అందుకు ముందు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ పూర్తి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అవసరమైన సహకారం అందించాలని ఆదేశించారు. ఇప్పటి వరకు మేడ్చల్––మల్కాజిగిరి జిల్లాలో ఈ యాప్ ద్వారా 3,598 ఎరువుల బుకింగ్‌లు నమోదయ్యాయని, వాటి ద్వారా 753 మెట్రిక్ టన్నుల ఎరువులు రైతులకు పంపిణీ చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ తనిఖీలో జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ, మండల వ్యవసాయ అధికారి రమేష్, వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనాథ్, మండలంలోని ఎరువుల డీలర్లు, రైతులు పాల్గొన్నారు.




## మూడవ ఫ్లోర్ నుండి పడి చిన్నారి మృతి



జులై 8 నిర్భయవార్త, జిల్లా ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా పటాన్ చెరువులో విషాదం నెలకొంది! రామ్ మందిర్ రోడ్ లో నివాసముంటున్న జ్యోతి కుమార్తె వంశిక 18 నెలలు మూడు అంతస్తులో ఆడుకుంటూ ప్రమాదవశాత్తు కిందపడింది చిన్నారి అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు! ఈ ఘటనతో కుటుంబ సభ్యులు బంధువులు శోకసముద్రంలో మునిగిపోయారు విషాదం తెలుసుకున్న పోలీసులు సమాచారం ప్రకారం వివరాలు సేకరిస్తున్నారు.

## ఈనెల 12న జిల్లాస్థాయి స్విమ్మింగ్ పోటీలు



జులై 8 నిర్భయవార్త: జిల్లా ప్రతినిధి: సంగారెడ్డి క్రీడా శాఖ స్విమ్మింగ్ పూల్ లో ఈ నెల 12న జిల్లాస్థాయి జూనియర్, సబ్ జూనియర్ స్విమ్మింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి శశాంక్ గౌడ్ బుధవారం నాడు తెలిపారు. 9 నుంచి 18 ఏళ్ల వయసు వారు అర్హులని చెప్పారు. ఎంపికైన క్రీడాకారులను గచ్చిబౌలిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

## తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని వినతి



జులై 8 నిర్భయవార్త, జిల్లా ప్రతినిధి: పాశమైలారం మల్లెపల్లి పరిశ్రమలో తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు సంగారెడ్డి జిల్లా కమిటీ కోరింది. ఈ మేరకు కార్మిక శాఖ మంత్రి వివేక వెంకట స్వామికి బుధవారం నాడు వినతి పత్రం అందజేశారు! స్పందించిన మంత్రి అదనపు కలెక్టర్ పాండుతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మల్లేశం తదిర్లు పాల్గొన్నారు.

## కెసిఆర్ ఫ్యామిలీ పై జగ్గారెడ్డి తీవ్ర విమర్శలు




జులై 8 నిర్భయవార్త, జిల్లా ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు కుటుంబంపై సంగారెడ్డి మాజీ శాసనసభ్యులు మరియు తెలంగాణ పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయ ప్రకాష్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. హరీష్ రావు మాటలను ప్రజలు నమ్మవద్దని సూచించారు. దొంగ మాటలు చెప్పడంలో కేసీఆర్ కుటుంబం నిపుణులు అని ఆరోపించారు! కాలేశ్వరం, మేడిగడ్డ ప్రాజెక్టులపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వాక్యాలు సరి అయినవేనని జగ్గారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ నేతల తప్పుడు ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పి కొడుతూనే ఉంటామని అన్నారు.

## పవిత్ర పుణ్యక్షేత్రమైనటువంటి భద్రాచలంనకు.వివిధ దేశాల నుండి వచ్చే భక్తులకి ఆటగా కలగరాదు..

భద్రాచలం 08 జూలై నిర్భయ వార్త ప్రతినిధి భద్రాచలం లో శ్రీ సీతారామచంద్రస్వామి కొలువై ఉన్నందున దేశ విదేశాల నుండి భక్తులు అధికంగా తరలివచ్చి పుణ్య గోదావరిలో స్నానమాచరించి శ్రీ సీతారామ చంద్రుని దర్శనం చేసుకుని వారి గమ్యస్థానాలకు వెళుతూ ఉంటారని భక్తులకు భద్రాచలం పట్టణ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా గోదావరి నది ఒడ్డున ఉన్న కరకట్ట ప్రదేశాలలో వీధి దీపాలను ఏర్పాటు చేయడం జరిగిందని భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట అన్నారు. బుధవారం నాడు సబ్ కలెక్టర్ కార్యాలయము నుండి ఆయన మాట్లాడుతూ దశాబ్దాల నాటి పురాతన చెత్త డంప్ సైటును ఐటీడీఏ పీవో బి రాహుల్ గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారిగా పనిచేసిన సమయంలో ఆయన మద్దతుతో సబ్ డివిజనల్ అడ్మినిస్ట్రేషన్ సమగ్ర గ్రీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం ప్రారంభించడంతో గోదావరి కరకట్ట ప్రదేశాలలో ప్రకృతి వనం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. గోదావరి గోదావరి కరకట్ట ప్రదేశాలలో గత సంవత్సరం అక్టోబర్ 2025 ఫిబ్రవరి 2026 మాసంలో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి అక్టోబర్ 2025లో ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని ఐదు ఎకరాలలో పదివేల యూకలిప్టస్ మొక్కలు గ్రామపంచాయతీ





సహకారంతో నాటించి వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవడం జరిగిందని అన్నారు. గోదావరి ఒడ్డున ఉన్న గ్రీన్ జోన్ క్లైమ్ చేసిన వ్యర్థాల డంపింగ్ యార్డ్ నుండి కనిపించే రూపాంతరం రాబోయే రెండు మూడు సంవత్సరాలలో గోదావరి నది తీర ప్రాంతం యొక్క పర్యావరణ ఆరోగ్యాన్ని గన్నియంగా పెంచుతుందని ప్రాంతాన్ని మరింత శుభ్రపరచడం పునర్ధరించడంలో మంచి పురోగతి సాధిస్తుందని అన్నారు. దీని ప్రభావం వలన దశాబ్దాల నాటి చెత్త డంపింగ్ స్థలం గోదావరి పొడవున మంచి గ్రీన్ జోన్ గా రూపాంతరం చెంది పర్యావరణ సమతుల్యత పునరుద్ధరించడంతో ఈ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజానీకానికి ఆరోగ్యం మెరుగుపడిందని అన్నారు. సి ఎస్ ఆర్ కార్యకలాపాల కింద ఐటీసీతో సమన్వయం చేసుకొని సహకారం అందించడంతో వంతెనకు రెండు వైపుల నుండి అప్రోచ్ రోడ్ల మధ్యస్థం పొడవునా పూల పెంపకం గ్రీన్ కవర్ పెంపుదల మార్చి 2026 లో పూర్తయిందని, దీని ఫలితంగా సౌందర్యం మరియు ఆకుపచ్చ కవర్ గనియంగా మెరుగుపడిందని అన్నారు. అదేవిధంగా గోదావరి కరకట్ట ప్రదేశాలలో రోడ్డు వెంబడి ప్రజలకు భద్రాచలం వచ్చే భక్తులకు గోదావరి పరిసరాలు ఆహ్లాదకరంగా విద్యుత్ కాంతులతో ప్రతిబింబించేలా వీధి దీపాలను ఏర్పాటు చేయడానికి సి ఎస్ ఆర్ ఐ టి సి సహకారం అందించగా గ్రామపంచాయతీ అధికారులు ఈ పనులను విజయవంతంగా పూర్తి చేయడంతో గోదావరి పరిసరాలు విద్యుత్ కాంతులతో చూపరు లకు అందంగా కనిపిస్తుందని అన్నారు.

## గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు నియోజకవర్గాల వారీగా శిక్షణ.

### జూలై 9, 10 తేదీల్లో మూడు కేంద్రాల్లో నిర్వహణ : డీఆర్డీఓ విద్యాచందన

భద్రాచలం జూలై 7 నిర్భయ వార్త ప్రతినిధి.గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక (జీపీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక) రూపకల్పన, అమలుపై జిల్లాలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు నియోజకవర్గాల వారీగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విద్యాచందన ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 9, 2026న ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు కొత్తగూడెం క్లబ్లో కొత్తగూడెం, ఇల్లందు, వైరా నియోజకవర్గాలకు చెందిన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే రోజు భద్రాచలంలోని వీరభద్ర ఫంక్షన్ హాల్లో భద్రాచలం, పినపాక నియోజకవర్గాలకు చెందిన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ నిర్వహించనున్నట్లు తెలిపారు .జూలై 10, 2026న ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు పట్వారిగూడెంలోని చలికాని ఆదమ్మ ఫంక్షన్ హాల్లో అశ్వారావుపేట నియోజకవర్గానికి చెందిన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక తయారీ, గ్రామ అవసరాల గుర్తింపు, ప్రాధాన్యతల నిర్ణయం, అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పన, ప్రభుత్వ మార్గదర్శకాల అమలుపై ఈ శిక్షణలో అవగాహన కల్పించనున్నట్లు డీఆర్డీఓ విద్యాచందన తెలిపారు. సంబంధిత నియోజకవర్గాలకు చెందిన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు నిర్ణీత తేదీ, సమయానికి ఆయా శిక్షణా కేంద్రాలకు తప్పనిసరిగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.




## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి... జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

### ప్రజల భాగస్వామ్యంతోనే సీజనల్ వ్యాధుల నివారణ సాధ్యం

ఖమ్మం, జూలై 08 నిర్భయవార్త రిపోర్టర్. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎన్ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. జ్వరం, జలుబు, దగ్గు లేదా ఇతర అనారోగ్య లక్షణాలు రెండు నుంచి మూడు రోజుల పాటు కొనసాగితే వాటిని ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా తప్పనిసరిగా సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)ను సందర్శించి వైద్య పరీక్షలు చేయించు కోవాలని కలెక్టర్ తెలిపారు. స్వీయ చికిత్సకు పాల్పడకుండా వైద్యుల సూచనల మేరకు చికిత్స తీసుకోవడం ద్వారా వ్యాధులు తీవ్రం కాకుండా నివారించవచ్చని అన్నారు. సీజనల్ వ్యాధుల నివారణలో వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండే పరిస్థితులను పూర్తిగా నివారించాలని, నిల్వ నీటిలోనే దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా, చికన్‌గున్యా వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఇళ్లలో ఉపయోగించకుండా ఉన్న పాత టైర్లు, పాత ఎయిర్ కూలర్లు, పూల కుండీలు, కొబ్బరి చిప్పలు, డబ్బాలు, బకెట్లు, ఇతర పాత్రల్లో నీరు నిల్వ ఉండకుండా తరచూ పరిశీలించి శుభ్రం చేయాలని సూచించారు. ఇంటి నీటి ట్యాంకులను కూడా క్రమం తప్పకుండా శుభ్రం చేయడంతో పాటు మూతలు వేసి ఉంచాలని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రజలు, స్థానిక సంస్థలు, వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేస్తే సీజనల్ వ్యాధులను సమర్థవంతంగా అరికట్టవచ్చని తెలిపారు. జ్వరం, జలుబు, ఒళ్లునొప్పులు, తలనొప్పి లేదా ఇతర అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రి లేదా సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి వైద్య సేవలు పొందాలని, ప్రజలు అప్రమత్తంగా ఉంటూ అవసరమైన అన్ని జాగ్రత్తలు పాటించడం ద్వారా తమ కుటుంబాన్ని, సమాజాన్ని సీజనల్ వ్యాధుల బారిన పడకుండా కాపాడవచ్చని జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



## రైతు ఆశీర్వాద సభను ప్రతిష్టాత్మకంగా రైతులను విజయవంతం చేయాలి





సింగరేణి జూలై 8 నిర్భయవార్త రిపోర్టర్. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ఈ నేల 10తారీఖున చింతకాని మండలం జగన్నాథపురం ఇ రోడ్ లో జరిగే రైతు ఆశీర్వాద సభనువిజయవంతం చేయాలనీ వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. సింగరేణి మండల అధికారులు, ప్రజాప్రతినిధులతో అప్పయిగూడెం రైతు వేదికలో సన్నాహక సమావేశాన్ని ఏర్పాటు చేసి అందరు ప్రణాళిక బద్దంగా పనిచేస్తూ సభను విజయవంతం చేయాలనీ కోరారు. రైతులకు చెప్పిన మాట ప్రకారం ఖరీఫ్ సీజన్ రైతు బందు పెట్టుబడి సహాయాన్ని వారి వ్యక్తిగత ఖాతాలకు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరావు, సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాస్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ పద్మావతి, ఎంపీవో రాజేంద్రప్రసాద్, ఏ ఓ అశోక్ కుమార్, సెర్ప్ ఏపీఎం వెంకటేశ్వర్లు, యన్.ఐ, గోపి, పార్టీ మండల అధ్యక్షులురాంబాబు, జిల్లానాయకులు రామ్మూర్తి నాయక్, చంద్రప్రకాష్, సురేందర్ మనియర్, మండల సర్పంచ్ లు రంజిత్ కుమార్, టోనీ, హీరాలాల్, రాందాన్, రాఘవులు, కిరణ్ కుమార్, వెంకటేశ్వర్లు, వీరాస్వామి, ఎల్లయ్య, బాలు, ఏఈఓ లు, పంచాయతీ కార్యదర్శులు, జిపిఓ లు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సీఎం దివంగత రాజశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు.





సింగరేణి జులై 8 నిర్భయవార్త రిపోర్టర్. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత వై. యస్ రాజశేఖర్ రెడ్డి 77 జన్మదిన వేడుకలను సింగరేణి మండల కేంద్రంలో కాంగ్రెస్ కమిటీ, మండలఅధ్యక్షులు తోటకూరి రాంబాబు, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇమ్మడి తిరుపతిరావు ఆధ్వర్యంలో సినిమా హాల్ సెంటర్ లో ఆయన విగ్రహం వద్ద పూలమాల తో నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయన ముఖ్యమంత్రి గా ఉన్నప్పుడు ప్రజా సంక్షేమ పథకాలు అనేకం ఇచ్చారని, వాటిలో ప్రధానమైనవి, రైతు రుణ మాఫీ ఆరోగ్య శ్రీ ఉచిత కరెంట్, ఇందిరమ్మ ఇండ్లు, 1 రూపాయికి రేషన్ బియ్యం, లాంటివి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేద ప్రజలకు అండగా నిలిచారు అంటున్నారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర కాంగ్రెస్ నాయకురాలు పగడాల మంజుల, జిల్లా నాయకులు ఇమ్మడి తిరుపతిరావు, జిల్లాకార్యదర్శి బానోత్ రామ్మూర్తినాయక్, మండల అధ్యక్షులు తలారి చంద్రప్రకాష్, వాణిజ్య ఉపాధ్యక్షులు సురేందర్ మనియర్, భీముడు నాయక్, విష్ణువర్ధన్ రెడ్డి, సర్పంచ్ లు మేదరిటోనీ, బానోత్ హీరాలాల్, వాంకుడోత్ హనుమంతరావు నాయకులు, పెద్దబోయిన తొగర శ్రీను , ఆదేర్ల రాములు, ఉమాశంకర్, హనీఫ్, బొల్లా రమేష్ తాజుద్దీన్, రూప్లనాయక్, నాగులు, వెంకటేశ్వర్లు ఈర్య, షఫీ, చాంద్ పాషా వినోద్, దేవుసింగ్, యాకుబ్ అలీ, సంగు, షేరు, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల 'లాస్ట్ బిల్లులు' వెంటనే చెల్లించాలి: ఎమ్మెల్యే జారే ఆదినారాయణపై సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ధ్వజం!

## అప్పులు తెచ్చి ఇళ్లు కడితే రూపాయి ఇవ్వరా.. ఇదేనా మీ ప్రజాపాలన

## అర్హులను పక్కనబెట్టి పైరవీకారులకే ఎమ్మెల్యే కోటా

## ఇల్లా పండూరి వీరబాబు తీవ్ర ఆగ్రహం.




అశ్వారావుపేట, జులై 9 ( నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి ) నిరుపేదలు ఎంతో నమ్మకంతో అప్పులు తెచ్చుకుని ఇందిరమ్మ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించుకుంటే, వారికి చెల్లించాల్సిన చివరి విడత (లాస్ట్ బిల్లు) నిధులను అధికారులు నిలిపివేయడం అత్యంత దుర్మార్గామని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకులు పండూరి వీరబాబు తీవ్రంగా మండిపడ్డారు. ప్రజాపాలన అని గొప్పలు చెప్పుకుంటున్న ఈ ప్రభుత్వంలో పేద ప్రజల ఆవేదన వినేవారే కరువయ్యారని ఆయన విమర్శించారు. అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారే ఆదినారాయణ గారికి ఈ నిరుపేదలపై బాధ్యత లేదా అని ఆయన నిలదీశారు. ఈసీ అంటే మీ గవర్నమెంట్ కాదా దమ్మపేట మండలం వెళ్ళి గ్రామంలో సుమారు 23 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఆగిపోయి ఉన్నాయని వీరబాబు ఆవేదన వ్యక్తం చేశారు. లబ్ధిదారులు ఈసీ కార్యాలయం చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా, అక్కడ బిల్లులు ఆగిపోయాయని నిర్లక్ష్యపు సమాధానాలు ఇస్తున్నారని మండిపడ్డారు. అసలు ఈసీ అంటే మీ ప్రభుత్వ పరిధిలోనిది కాదా అని ఎమ్మెల్యేను ప్రశ్నించారు. అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగి తిరిగి పేద ప్రజలు అలిసిపోయారని, అప్పులు తెచ్చి బేస్‌మెంట్లు, ఫౌండేషన్లు వేసుకున్న నిరుపేదలకు ఇప్పుడు ఉరితాడే శరణ్యమా అని ఆందోళన వ్యక్తం చేశారు.

ఇదేనా మీ ప్రజా పాలన అంటూ ధ్వజమెత్తారు. ప్రజలు ఎంతో నమ్మి మిమ్మల్ని గెలిపిస్తే, ఇలాంటి ప్రజావ్యతిరేక పరిపాలన సాగిస్తారా ప్రజల పడే బాధలను ఆలకించి వెంటనే పాత బిల్లులు చెల్లించాలి. లేకపోతే రాబోయే ఎన్నికల్లో ప్రజలే మీకు బుద్ధి చెబుతారు. పండూరి వీరబాబు, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకుడుకుర్చీలు వేసే వారికే ఇళ్లా.. నియోజకవర్గంలో ఎమ్మెల్యే కోటా కింద కేటాయించే ఇళ్లను పారితోషికాలు (పైరవీలు) తీసుకుని ఇస్తున్నట్లు తమకు సమాచారం ఉందని వీరబాబు ఆరోపించారు. అర్హులను పక్కనబెట్టి మీకు నచ్చిన వారికి, మీ వెనుక తిరిగే వారికే కోటాలు ఇచ్చుకోవడం ఎంతవరకు న్యాయమని అడిగారు. అదేవిధంగా, రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో తీవ్ర అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ఒకే ఇంట్లో భార్యాభర్తలు కలిసి ఉంటున్నా, వారు విడిపోయినట్లు తప్పుడు పత్రాలు సృష్టించి ఇళ్లు కేటాయించారని, ఇల్లు లేని నిజమైన నిరుపేదలకు, జానెడు స్థలం లేని వారికి మాత్రం మొండిచేయి చూపించారని విమర్శించారు. కేవలం మీ నాయకుల చుట్టూ తిరుగుతూ, మీ సభల్లో కుర్చీలు వేసే వారికే ఇళ్లు పంచుతారా అని దుయ్యబట్టారు. అసలైన అర్హులని ప్రతి పేదవానికి ఇల్లు ఇచ్చి, పాత లబ్ధిదారుల లాస్ట్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజా పోరాటాలు నిర్వహిస్తామని పండూరి వీరబాబు స్పష్టం చేశారు

# మందులున్నా వేసే నాథుడే లేడు: పశువైద్యశాలల్లో డాక్టర్ల కొరతతో మూగజీవాల అల్లాటల్లా!

### ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యంతో పడకేసిన పశువైద్య సేవలు

### అరకొర సిబ్బందితోనే నామమాత్రంగా ఆసుపత్రుల నిర్వహణ

### వర్షాకాలం ముంచుకొస్తున్నా పట్టించుకోని పాలకులు.. పశువుల యజమానుల ఆవేదన

అశ్వారావుపేట జులై 9 (నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి)మండల వ్యాప్తంగా పశువైద్య సేవలు పూర్తిగా అస్తవ్యస్తంగా మారాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇక్కడ పూర్తిస్థాయిలో వైద్యులు ఉండాల్సి ఉండగా, అధికారుల తీవ్ర నిర్లక్ష్యం వల్ల పశువైద్యశాలలు అరకొర సిబ్బందితో నామమాత్రంగా నడుస్తున్నాయి. పశువుల ప్రాణాలను కాపాడాలనే కనీస బాధ్యతను అధికారులు మరిచారని, క్షేత్రస్థాయిలో మూగజీవాల యజమానులు, రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.




**మందులు ఉన్నాయి.. కానీ వేసే నాథుడే లేడు!**

ప్రభుత్వం నుంచి పశువులకు కావలసిన మందులు, ఇంజెక్షన్లు సకాలంలో ఆసుపత్రులకు అందుతున్నప్పటికీ, వాటిని ఉపయోగించి మూగజీవాలకు చికిత్స అందించే డాక్టర్లు లేకపోవడం ఇక్కడి దారుణ పరిస్థితికి అద్దం పడుతోంది. "మందులు ఉన్నాయి.. కానీ వేసే నాథుడే లేడు" అంటూ పశువుల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తీవ్రమైన సిబ్బంది కొరత కారణంగా ఉన్న ఒక్క డాక్టరే మూడు కేంద్రాలకు (అశ్వారావుపేట, వినాయకపురం, నారాయణపురం) ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తూ వారానికి రెండు రోజులు చొప్పున తిరగాల్సి వస్తోంది. దీంతో అత్యవసర సమయాల్లో పశువులకు వైద్యం అందడం గగనంగా మారింది.


**అదనపు బాధ్యతల భారం:**

ఇది చాలదన్నట్టు, ప్రస్తుతం ఉన్న పశువైద్యుడికి ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి ఐదు పంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. దీనివల్ల ఆయన ఒకవైపు స్థానిక పశువైద్యశాలలను చూసుకుంటూనే, మరోవైపు అధికారిక సమావేశాలకు, క్షేత్రస్థాయి పరిశీలనలకు వెళ్లాల్సి వస్తోంది. సిబ్బంది కొరత కారణంగా కింది స్థాయి సహాయకులు (అసిస్టెంట్లు) కూడా ఎవరూ లేకపోవడంతో కార్యాలయ సబార్డినేట్లు, గోపాల మిత్రల సహాయంతోనే నెట్టుకొస్తున్నారు. వినాయకపురం లాంటి కేంద్రాల్లో కేవలం ఒక గోపాల మిత్ర మాత్రమే విధులు నిర్వహిస్తుండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. నారాయణపురం ఆసుపత్రి కింద ఉన్న గుమ్మడవెల్లి సబ్ సెంటర్‌లో కూడా సిబ్బంది లేక ఒంటరిగానే విధులు నిర్వహించాల్సి వస్తోందని క్షేత్రస్థాయి సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రమోషన్లు లేక ఆగిన నియామకాలు,**

పైస్థాయి నుంచి ప్రమోషన్లు రాకపోవడం, కొత్త నియామకాలు జరగకపోవడంతోనే ఈ సమస్య తలెత్తినట్లు తెలుస్తోంది. కనీసం రాబోయే సెప్టెంబర్ నాటికైనా ప్రమోషన్ల ప్రక్రియ పూర్తయి కొత్త అధికారులు వస్తేనే ఈ సమస్య తీరే అవకాశం ఉందని క్షేత్రస్థాయి సిబ్బంది భావిస్తున్నారు. పక్కనే ఉన్న దమ్మపేట వంటి ప్రాంతాల్లో ముగ్గురు డాక్టర్లు ఉన్నప్పటికీ, ఇక్కడ మాత్రం తీవ్ర అన్యాయం జరుగుతోందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, ఇక్కడి పశువైద్యశాలలకు పూర్తిస్థాయి డాక్టర్లను, సిబ్బందిని నియమించి మూగజీవాలను, వాటిపై ఆధారపడిన రైతులను ఆదుకోవాలని, ప్రస్తుతం వర్షాకాలం ముంచుకొస్తుండటంతో గొంతువాపు, జబ్బవాపు వంటి ప్రాణాంతక సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది. ఇలాంటి సమయంలో ముందస్తుగా పశువులకు టీకాలు (వ్యాక్సిన్లు) వేయాల్సి ఉండగా, డాక్టర్లు లేని కారణంగా రైతులు తమ పాడి పశువులను, జీవాలను కాపాడుకోవడానికి ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయించి వేల రూపాయలు కుమ్మరించాల్సి వస్తోంది.

**ఇప్పటికైనా కళ్ళు తెరవండి,**



అధికారులు, ప్రజాప్రతినిధులు రాజకీయ ప్రయోజనాలను పక్కనబెట్టి, తమ విధులకు ప్రాధాన్యత ఇవ్వాలని మండల రైతాంగం డిమాండ్ చేస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, ఇక్కడి పశువైద్యశాలలకు పూర్తిస్థాయి డాక్టర్లను నియమించాలని, అందుబాటులో ఉన్న మందులను సకాలంలో పశువులకు అందేలా చూసి మూగజీవాల ప్రాణాలను కాపాడాలని కోరుతున్నారు.

# సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

మంచిర్యాల, జూలై 08,(నిర్భయ వార్త జిల్లా ప్రతినిది సింగరేణి విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న పెన్షన్, పీపీఓ, క్లెయిమ్‌ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధులు బుధవారం సీఎంపీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ గోవర్ధన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రతి నెల ఒకటో తేదీనే అన్ని బ్యాంకుల ఖాతాల్లో పెన్షన్ జమయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నెల ఎస్‌బీఐ ఖాతాదారులకు పెన్షన్ ఆలస్యంగా జమ కావడంతో పలువురు విశ్రాంత ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. ఇంకా వేలాది మంది పెన్షనర్లకు పీపీఓ ప్రతులు అందలేదని, వాటిని వెంటనే జారీ చేయాలని, పదవీ విరమణ చేసిన ఉద్యోగుల సీఎంపీఎఫ్ క్లెయిమ్‌లను జాప్యం లేకుండా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రంపై స్పందించిన అసిస్టెంట్ కమిషనర్ గోవర్ధన్, విశ్రాంత ఉద్యోగుల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారనీ అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు రాళ్లబండి రాజన్న, అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి పూదరి నర్సయ్య, ఉపాధ్యక్షుడు ఏ. గంగయ్య తదితరులు పాల్గొన్నారు

# టు వీలర్ వాహనాలపై త్రిబుల్ రైడింగ్ తో విద్యార్థులు చక్కర్లు.

### లైసెన్స్ అనర్హత డ్రైవింగ్ లో స్పీడు.





సింగరేణి/కారేపల్లి జులై 8 నిర్భయవార్త రిపోర్టర్. కారేపల్లి గ్రామంలో మైనర్ విద్యార్థులు త్రిబుల్ రైడింగ్ తో విద్యార్థులు చక్కర్లు చేస్తున్నారని పలువురు గ్రామస్తులు తెలిపారు. మోడల్ స్కూల్ ముగింపు సమయంలో పలు వీధుల్లో త్రిబుల్ రైడింగ్ తో చెక్కర్లు కొడుతూ ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తున్నట్లు గ్రామ ప్రజలు వాపోయారు. మెయిన్ రహదారి పై బైక్ పై స్టంట్ వేస్తూ చెక్కర్లతో షికారులు చేస్తున్నారు. లైసెన్స్ అనర్హత కలిగి ఉండి కూడా చక్కర్లు కొడుతూ పలు వాహనాలపై ఇబ్బందులు కలిగించే రాష్ రీడింగ్ చేస్తున్నారు. జరగరాని సంఘటనలు జరిగితే విద్యార్థులతో పాటు, ఇతరులకు ప్రమాదకటిక సంభవించే ఘటనలు ఎదురవుతాయి. పోలీస్ శాఖ స్పందించి రాష్ రైడింగ్, లైసెన్స్ అనర్హత డ్రైవింగ్ పై నిఘ ఏర్పాటు చేస్తే మంచిదని ప్రజలు కోరుతున్నారు. గతంలో కానిస్టేబుల్స్ రాష్ రైడింగ్, మైనర్ విద్యార్థులు రైడింగ్ చేసే వారిపై ప్రత్యేక నిఘ పెట్టి చట్టపరమైన చర్యలు చేపట్టారని మరల కొనసాగించాలని ప్రజలు కోరుతున్నారు.

# దశదినకర్మలో నివాళులర్పించిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే లు




సింగరేణి జూలై 8 నిర్భయవార్త రిపోర్టర్. జర్నలిస్టు అజ్మీర వీరన్న మాతృమ్మూర్తి అజ్మీ ఈరీ సంస్మరణ కార్యక్రమం బుధవారం కారేపల్లి మండలం భీక్యాతండాలో జరిగింది. ఈ కార్యక్రమానికి వైరా ఎమ్మెల్యే మాలోతు రామదాసు నాయక్ మాజీ ఎమ్మెల్యే లావుడియా రాముల నాయక్, వివిధ పార్టీల నాయకులు హాజరై ఈరీ చిత్రపటానికి పూలమాలలు వేసినివాళు అర్పించారు. ఈరీ కుమారులైన జర్నలిస్టు అజ్మీర వీరన్న, ఏఐటీయుసీ నాయకులు అజ్మీర బిచ్చానాయక్, సురేష్ లను నాయకులు పరామర్శించి సానుభూతిని తెలిపారు. ఈకార్యక్రమంలో సీపీఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్య వీరభద్రం, కే.నరేంద్ర, శోభన్ నాయక్, కాంగ్రెస్ నాయకులు తోటకూరి రాంబాబు, పగడాల మంజుల, బానోత్ రాంమ్మూర్తి, నర్సింగ్ శ్రీనివాసరావు, సర్పంచ్ ల సంఘం మండల అధ్యక్షులు భూక్య రంజిత్ కుమార్, బీఆర్ఎస్ నాయకులు లాకావత్ గిరిబాబు, హన్మకొండ రమేష్, బత్తుల శ్రీనివాస్, జాల సాంబ, నాయకులు బోళ్ల రమేష్,ఆదెర్ల రాములు, ఎండీ హనీఫ్, వాచ్యా, చాంది తదితరులు పాల్గొన్నారు.

# ఆధునిక బోధనతో విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించాలి

మంచిర్యాల, జూలై 08, (నిర్భయ వార్త జిల్లా ప్రతినిధిఆధునిక బోధనా విధానాలను అనుసరిస్తూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకత, నైపుణ్యాలను పెంపొందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా విద్యాశాఖ అధికారి పి. చంద్రయ్య ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఆధునిక బోధనా పద్ధతులను అమలు చేయాలని, ప్రతి ఉపాధ్యాయుడు నిరంతరం తన విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులు కొత్త ఆవిష్కరణలు, పరిశోధనల పట్ల ఆసక్తి కనబరిచేలా ప్రోత్సహించాలని చెప్పారు. అనంతరం బెల్లంపల్లి మండలం బుద్ధకాలన్ గ్రామంలో ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ షెడ్ నిర్మాణానికి భూమిపూజ చేసి వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఘన, ద్రవ వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణకు గ్రామపంచాయతీలు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. భీమిని మండలంలో వనమహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ, అభివృద్ధి పనులను పరిశీలించారు. కేస్లాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాలను సందర్శించి మౌలిక సదుపాయాలను తనిఖీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# 11 కేవీ విద్యుత్ తీగ తగిలి కేబుల్ ఆపరేటర్ మృతి



జన్నారం, జూలై 08,(నిర్భయ వార్త జిల్లా ప్రతినిధికేబుల్ వైర్ మరమ్మతు చేస్తుండగా 11 కేవీ విద్యుత్ లైన్ తగిలి ఓ కేబుల్ ఆపరేటర్ మృతిచెందిన విషాద ఘటన జన్నారం మండలంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు జన్నారం మండలం రాంపూర్––తిమ్మాపూర్ గ్రామాల మధ్య డిష్ కేబుల్ వైర్ కింద పడిపోవడంతో దానిని సరిచేసేందుకు విద్యుత్ స్తంభం వద్ద కేబుల్ లాగుతున్న సమయంలో 11 కేవీ విద్యుత్ లైన్ తగిలి, నాగసముద్రం గ్రామానికి చెందిన దుర్గం పోచయ్య (43), కేబుల్ ఆపరేటర్, తీవ్ర విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. స్థానికులు వెంటనే లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు వారు తెలిపారు. ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఆచి తూచి కొనాలి...

**జీ**తం వచ్చే రోజు కంటే, నెలాఖరు ఎలా గడుస్తుందా అనే ఆందోళనే ఇప్పుడు చాలా కుటుంబాల్లో ఎక్కువ. మార్కెట్‌కు వెళ్లిన ప్రతిసారీ ధరలు కొత్త షాక్ ఇస్తున్నాయి. కూరగాయల నుంచి పిల్లల చదువు వరకు, పెట్రోల్ నుంచి వైద్య ఖర్చుల వరకు అన్నీ భారమవుతున్నాయి. ఇలాంటి సమయంలో ఆదాయం పెరగకపోయినా, ఖర్చు తగ్గించే అలవాట్లు పెరిగితే కుటుంబ ఆర్థిక పరిస్థితి ఎంతో మేర మెరుగుపడుతుంది. ప్రతి కుటుంబం ఆచరించదగిన కొన్ని సులభమైన జాగ్రత్తలు ఇవి.

• నెల ప్రారంభంలోనే కుటుంబ బడ్జెట్ తయారు చేసుకోవాలి. ఆదాయం ఎంత? తప్పనిసరి ఖర్చులు ఎంత? పొదుపు ఎంత? అనేది ముందే నిర్ణయించుకోవాలి. ఇంట్లో అందరికీ కనిపించే చోట ఈ నెల ఖర్చుల వివరాలు రాసే చిన్న బోర్డు ఉంచాలి. దాంతో ఎవరు ఎంత ఖర్చు చేస్తున్నారో కుటుంబ సభ్యులందరికీ తెలుస్తుంది. మార్కెట్‌కు వెళ్లే ముందు కొనాల్సిన వస్తువుల జాబితా తయారు చేసుకోవాలి. జాబితాలో లేని వస్తువులు కొనకూడదు. ఒక వస్తువు కోసం పదేపదే బయటకు వెళ్లకుండా, ఒకే ప్రయాణంలో అన్ని పనులు పూర్తయ్యేలా ప్రణాళిక వేసుకోవాలి. కుటుంబ సభ్యుల మధ్య సమన్వయం ఉంటే ఒకే వస్తువును ఇద్దరు కొనడం, అనవసర ప్రయాణాలు చేయడం వంటి ఖర్చులు తగ్గుతాయి.

• దగ్గర దూరాలకు బైక్, కారు తీసుకెళ్లే బదులు నడిచి వెళ్లడం అలవాటు చేసుకోవాలి. రెండు మూడు కిలోమీటర్ల దూరాలకు సైకిల్ వాడితే పెట్రోల్ ఖర్చు తగ్గడమే కాదు, ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. ఆన్‌లైన్‌లో ఒక్కో వస్తువును విడివిడిగా ఆర్డర్ చేయకుండా, అవసరమైన వాటిని ఒకేసారి తెప్పించుకుంటే డెలివరీ ఛార్జీలు తగ్గుతాయి. చిన్న అవసరాలకు ఇంటి పక్కనే దొరికే



వస్తువులను ఆన్‌లైన్‌లో కొనడం కన్నా నడిచి వెళ్లి తెచ్చుకోవడం చవకగా ఉంటుంది.

• కూరగాయలు వీలైనంత వరకు రైతు బజారులో లేదా నేరుగా రైతుల నుంచి కొనాలి. ఒకే కూరగాయల దుకాణంలో తరచూ కొనుగోలు చేస్తే మంచి సరుకు ఇవ్వడమే కాకుండా కొంత తగ్గింపు కూడా లభించే అవకాశం ఉంటుంది. సీజన్‌లో లభించే కూరగాయలు, పండ్లనే ఎక్కువగా కొనాలి. దూర ప్రాంతాలు లేదా విదేశాల నుంచి వచ్చే ఖరీదైన పండ్ల కంటే స్థానికంగా పండే జామ, అరటి, బొప్పాయి, మామిడి వంటి పండ్లను ఎంచుకోవడం మంచిది. అవి తాజాగా ఉండటంతో పాటు తక్కువ ధరకే లభిస్తాయి.

• పోషకాహారం అంటే ఖరీదైన ఆహారం కాదని గుర్తుంచుకోవాలి. రాగులు, జొన్నలు, సజ్జలు, పెసలు, శనగలు, అలసందలు, పల్లీలు, గుడ్లు, జామ, బొప్పాయి, అరటి వంటి తక్కువ ధరలో లభించే ఆహారాల్లోనే శరీరానికి అవసరమైన పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఖరీదైన ప్యాకెట్ ఆహారాలు, విదేశీ పండ్లు, శీతల పానీయాల కంటే స్థానికంగా లభించే తాజా ఆహారమే ఆరోగ్యానికీ, జేబుకూ మేలు చేస్తుంది. బయట తినే అలవాటును తగ్గించి ఇంట్లో వండిన ఆహారానికే ప్రాధాన్యం ఇవ్వాలి. ఆహారాన్ని వృథా చేయకుండా మిగిలినదాన్ని మరో విధంగా ఉపయోగించుకోవాలి.

• విద్యుత్, నీటి వినియోగంలో కూడా జాగ్రత్త అవసరం. అవసరం లేని లైట్లు, ఫ్యాన్లు, టీవీలు ఆఫ్ చేయాలి. నీటిని వృథా చేయకూడదు. వాడని ఓటీటీలు, మొబైల్ యాప్‌లు, ఇతర సబ్‌స్క్రిప్షన్‌లను రద్దు చేసుకోవాలి. "ఆఫర్ ఉంది" అనే కారణంతో కొనుగోలు చేయకుండా, నిజంగా అవసరం ఉన్నప్పుడే కొనాలి. అప్పు చేసి విలాస వస్తువులు కొనడం మానుకోవాలి. అప్పు అత్యవసర అవసరాలకే పరిమితం కావాలి.

• పిల్లలకు చిన్నప్పటి నుంచే డబ్బు విలువ, పొదుపు విలువ నేర్పాలి. ప్రతి కోరిక వెంటనే తీర్చాల్సిన అవసరం లేదని వారికి అర్థమయ్యేలా చెప్పాలి. ఇంటి వద్ద కొత్తిమీర, పుదీనా, కరివేపాకు, మిరప, టమాటా వంటి చిన్న కూరగాయల తోట పెంచుకుంటే రోజువారీ ఖర్చు కొంత తగ్గుతుంది. వీలైతే కుటుంబంలో ఒకరైనా అదనపు ఆదాయం వచ్చే చిన్న పని చేయాలి. ఆదాయం వచ్చిన వెంటనే కొంత మొత్తాన్ని ముందుగా పొదుపుగా పక్కన పెట్టి, మిగిలిన డబ్బుతోనే నెలవారీ ఖర్చులు నిర్వహించడం అలవాటు చేసుకోవాలి.

# క్రమం తప్పితే నిర్లక్ష్యం చేయొద్దు



**చా**లామంది నెలసరి ఒకటి రెండు నెలలు ఆలస్యమైనా, తేదీలు మారినా 'ఇది సహజమే' అనుకుని నిర్లక్ష్యం చేస్తుంటారు. ఒత్తిడి, చదువు, ఉద్యోగం, ప్రయాణం, ఆహారపు అలవాట్ల మార్పు, బరువు పెరగడం లేదా తగ్గడం వంటి కారణాలతో అప్పుడప్పుడు రుతుచక్రంలో మార్పులు రావడం సహజమే. అయితే నెలసరి తరచూ క్రమం తప్పడం, రెండు మూడు నెలలకు ఒకసారి మాత్రమే రావడం, అధికంగా లేదా చాలా తక్కువగా రక్తస్రావం కావడం వంటి లక్షణాలను మాత్రం నిర్లక్ష్యం చేయకూడదని తాజా వైద్య మార్గదర్శకాలు హెచ్చరిస్తున్నాయి. ఇలాంటి లక్షణాలు ఉంటే వెంటనే పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ (పీసీఓఎస్) కోసం పరీక్షించాలని నిపుణులు సూచిస్తున్నారు.

పీసీఓఎస్ అనేది మహిళల్లో అత్యంత సాధారణంగా కనిపించే హార్మోన్ల అసమతుల్యత సమస్యల్లో ఒకటి. ప్రపంచవ్యాప్తంగా ప్రతి పది మంది మహిళల్లో ఒకరి నుంచి ముగ్గురు వరకు ఈ సమస్యతో బాధపడుతున్నారని అంచనా. భారతదేశంలో కూడా దీని ప్రభావం క్రమంగా పెరుగుతోంది. యుక్తవయసు నుంచి 40 ఏళ్లలోపు మహిళల్లో ఇది ఎక్కువగా కనిపిస్తోంది. ఈ సమస్యలో అండాశయాల్లో చిన్న చిన్న ద్రవంతో నిండిన తిత్తులు ఏర్పడతాయి. శరీరంలోని హార్మోన్ల సమతుల్యత దెబ్బతింటుంది. ఫలితంగా నెలసరి క్రమం తప్పడం, ముఖంపై వెంట్రుకలు పెరగడం, మొటిమలు, జుట్టు రాలిపోవడం, బరువు పెరగడం, గర్భం దాల్చడంలో ఇబ్బందులు వంటి లక్షణాలు కనిపించవచ్చు. అయితే ప్రతి మహిళలో ఒకే లక్షణాలు ఉండవు.

ఇటీవలి వైద్య మార్గదర్శకాలు ఒక ముఖ్యమైన విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. పీసీఓఎస్‌ను కేవలం సంతానోత్పత్తి సమస్యగా చూడకూడదు. ఇది శరీర జీవక్రియపై కూడా ప్రభావం చూపుతుంది. ఈ సమస్య ఉన్న మహిళల్లో మధుమేహం, అధిక రక్తపోటు, గుండెజబ్బులు, కొవ్వు కాలేయం, నిద్రలో శ్వాస ఆగే సమస్య, మానసిక ఆందోళన వంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని పరిశోధనలు చెబుతున్నాయి. అందుకే దీనిని ఎంత త్వరగా గుర్తిస్తే అంత మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

పీసీఓఎస్‌ను గుర్తించడానికి వైద్యులు రుతుచక్ర వివరాలు, శారీరక లక్షణాలు, రక్త పరీక్షలు, అవసరమైతే అల్ట్రాసౌండ్ పరీక్షలు చేస్తారు. ప్రతి నెలసరి సమస్యకు పీసీఓఎస్ ఒక్కటే కారణం కాకపోయినా, దాన్ని తొలిదశలోనే గుర్తించడం వల్ల చికిత్స సులభమవుతుంది. జీవనశైలిలో మార్పులు, సమతుల ఆహారం, క్రమం తప్పకుండా వ్యాయామం, బరువు నియంత్రణ, అవసరమైతే మందులతో ఈ సమస్యను చాలా వరకు అదుపులో ఉంచవచ్చు. నెలసరి తరచూ ఆలస్యం అవుతుంటే, మూడు నెలలకు మించి రాకపోతే లేదా ఇతర అసాధారణ లక్షణాలు కనిపిస్తే స్వయంగా మందులు వాడకుండా స్త్రీరోగ నిపుణులను సంప్రదించడం ఉత్తమం. ముందుగానే గుర్తిస్తే పీసీఓఎస్ వల్ల వచ్చే దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలను గణనీయంగా తగ్గించే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

# యాంగ్జైటీ అంటే ఏమిటి.. దీనికి కారణాలేంటి.. ఏం చేయాలి..?

ఆందోళన (యాంగ్జైటీ) కేవలం మనసుకు సంబంధించిన సమస్య మాత్రమే కాదని, అది శరీరంలోని అనేక భాగాలపై కూడా ప్రత్యక్ష ప్రభావం చూపుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. గుండె వేగంగా కొట్టుకోవడం, శ్వాస వేగం పెరగడం, కండరాలు బిగుసుకుపోవడం, తలనొప్పి, కడుపు అసౌకర్యం వంటి లక్షణాలు కూడా యాంగ్జైటీ సంకేతాలే అని వారు చెబుతున్నారు. ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడి కారణంగా ఈ సమస్య మరింత సాధారణంగా మారుతోందని హెచ్చరిస్తున్నారు. నిపుణుల ప్రకారం, యాంగ్జైటీ అంటే ఏదో ప్రమాదం ఉందని శరీరం లేదా మనసు భావించే పరిస్థితి. ఈ ప్రమాదం బయట నుంచి రావచ్చు లేదా శరీర సామర్థ్యాలు, పరిస్థితులపై ఏర్పడే భయం వల్ల కూడా రావచ్చు. అలాంటి సమయంలో శరీరం రక్షణ చర్యలకు సిద్ధమవుతూ అనేక శారీరక మార్పులను ప్రదర్శిస్తుంది. యాంగ్జైటీ ప్రభావం ముందుగా గుండె, ఛాతీ భాగంలో కనిపిస్తుంది. గుండె వేగంగా కొట్టుకోవడం, ఛాతీలో బిగుతుగా అనిపించడం, శ్వాస వేగంగా మారడం, కొన్నిసార్లు తల తిరిగినట్లు అనిపించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇవి శరీరం అప్రమత్త స్థితిలోకి వెళ్లిన సంకేతాలని నిపుణులు వివరిస్తున్నారు.



**జీర్ణ వ్యవస్థపై ప్రభావం..**

యాంగ్జైటీ వల్ల జీర్ణవ్యవస్థ కూడా ప్రభావితమవుతుంది. ఒత్తిడి సమయంలో శరీరం రక్తప్రసరణలో ఎక్కువ భాగాన్ని కండరాల వైపు మళ్లించి, ప్రమాదాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధమవుతుంది. దీంతో జీర్ణవ్యవస్థ పనితీరు తాత్కాలికంగా మందగించి వికారం, కడుపు ఉబ్బరం, అజీర్ణం, తరచుగా మలవిసర్జనకు వెళ్లాల్సిన పరిస్థితి వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అదే సమయంలో కండరాలు కూడా ఎక్కువ ఒత్తిడికి గురవుతాయి. శరీరం ఎప్పుడైనా స్పందించాల్సిన పరిస్థితి వస్తుందనే అప్రమత్తతతో కండరాలు బిగుసుకుపోతాయి. ఫలితంగా మెడ నొప్పి, భుజాలు బిగుసుకుపోవడం, వెన్ను నొప్పి, శరీరంలో బిగుతుగా అనిపించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

**నిర్లక్ష్యం చేయవద్దు..**

ఈ శారీరక మార్పులన్నీ వాస్తవానికి శరీరం తనను తాను రక్షించుకునేందుకు చేసే సహజ ప్రతిస్పందనలో భాగమేనని నిపుణులు చెబుతున్నారు. అయితే ఈ లక్షణాలు తరచూ కనిపించినా చాలామంది వాటిని సాధారణ నొప్పులు లేదా అలసటగా భావించి నిర్లక్ష్యం చేస్తుంటారని వారు అంటున్నారు. గుండె వేగంగా కొట్టుకోవడం, శ్వాసలో ఇబ్బంది, మెడ లేదా వెన్ను నొప్పి, జీర్ణ సమస్యలు వంటి లక్షణాలు తరచూ కనిపిస్తూ రోజువారీ జీవితాన్ని ప్రభావితం చేస్తుంటే వాటి వెనుక యాంగ్జైటీ కూడా ఒక కారణంగా ఉండే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు. అలాంటి పరిస్థితుల్లో లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా అవసరమైతే వైద్యులు లేదా మానసిక ఆరోగ్య నిపుణులను సంప్రదించి సరైన సలహా, చికిత్స పొందడం మంచిదని వారు పేర్కొంటున్నారు.

# యోగా చేస్తే జ్ఞాపకశక్తి పెరుగుతుందా?

క్రమం తప్పకుండా యోగా, వ్యాయామం చేయడం వల్ల శరీరంలోని యాంటీఆక్సిడెంట్ వ్యవస్థ బలపడుతుంది. దీంతో కణాలకు నష్టం కలిగించే ఆక్సిడేటివ్ ఒత్తిడి తగ్గుతుంది. అలాగే శరీరంలో ఇన్‌ఫ్లమేషన్‌ను పెంచే కొన్ని రసాయనాల స్థాయిలు తగ్గుతాయి. ఒత్తిడికి కారణమయ్యే కార్టిసాల్ హార్మోన్ కూడా తగ్గుతుంది. ఫలితంగా గుండె జబ్బులు, మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదం తగ్గుతుంది.




**మెదడు, జ్ఞాపకశక్తికి మేలు**

ఎక్కువకాలం యోగా చేసే వారి మెదడులో జ్ఞాపకశక్తి, ఆలోచన, నిర్ణయాలు తీసుకునే భాగాలు ఆరోగ్యంగా ఉంటాయి. ప్రాణాయామం వంటి శ్వాస వ్యాయామాలు ఒత్తిడిని తగ్గించి మనసుకు ప్రశాంతతను కలిగిస్తాయి. అలాగే మెదడు కణాల పెరుగుదలకు ఉపయోగపడే దీణచీఖీ అనే ప్రొటీన్ స్థాయిలు కూడా పెరుగుతాయి.

**బలం, సమతుల్యత**

యోగా వల్ల కండరాలు బలపడతాయి. వెన్నెముక, తుంటి భాగాల చలనం మెరుగుపడుతుంది. సమతుల్యత పెరగడం వల్ల వృద్ధుల్లో పడిపోవడం వంటి ప్రమాదాలు తగ్గుతాయి. ఎముకల బలం కూడా మెరుగుపడి ఆస్టియోపొరోసిస్ ప్రమాదం తగ్గే అవకాశం ఉంటుంది.

**గుండె ఆరోగ్యం, మధుమేహ నియంత్రణ**

యోగా చేయడం వల్ల రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. రక్తప్రసరణ మెరుగుపడుతుంది. దీంతో గుండెపోటు, పక్షవాతం వచ్చే ప్రమాదం తగ్గుతుంది. అలాగే ఇన్సులిన్ పనితీరు మెరుగై టైప్-2 మధుమేహం ఉన్నవారిలో రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉండేందుకు సహాయపడుతుంది.

**వృద్ధులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

యోగా అందరికీ మంచిదే అయినప్పటికీ, వృద్ధులు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. గుండె సమస్యలు, ఆర్థరైటిస్ లేదా కీళ్ల మార్పిడి చేసినవారు కొన్ని ఆసనాలను చేయకూడదు. తలను కిందికి వంచే ఆసనాలు లేదా ఎక్కువసేపు మోకాళ్లపై కూర్చునే భంగిమలను నివారించడం మంచిది. కుర్చీలో కూర్చుని లేదా అవసరమైన సహాయక పరికరాలతో యోగా చేయవచ్చు. వృద్ధులు యోగా ప్రారంభించే ముందు తప్పనిసరిగా వైద్యులని సంప్రదించడం మంచిది.

# సినిమా సిత్రం


## 20ఏళ్ల తర్వాత సేమ్ గ్రేస్.. తమన్ 'హృదయం మురళి' క్లిక్ అయితే..



యంగ్ హీరో అథర్వ మురళి లీడ్ రోల్ లో నటిస్తున్న ఆ చిత్రానికి ఆకాశ్ భాస్కరన్ దర్శకత్వం వహించారు. ప్రీతి ముకుందన్, కయదు లోహర్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. టాలీవుడ్ లో సంగీత దర్శకుడిగా వరుస విజయాలతో దూసుకెళ్తున్న తమన్ ఇప్పుడు మరోసారి నటుడిగా ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. దాదాపు 20 ఏళ్ల తర్వాత ఆయన కెమెరా ముందుకు రావడం సినీ ప్రియుల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది. తమిళంలో రూపొందిన ఇదయం మురళి చిత్రాన్ని తెలుగులో హృదయం మురళి పేరుతో జూలై 10న విడుదల చేయనున్నారు. ఆ చిత్రంలో తమన్ కీలక పాత్ర పోషించడంతో పాటు సంగీతాన్ని కూడా అందించడం విశేషం. 2003లో దర్శకుడు శంకర్ తెరకెక్కించిన బాయ్స్ సినిమాలో కృష్ణ అనే యువకుడి పాత్రలో తమన్ నటించారు. ఆ సినిమా తర్వాత పూర్తిగా సంగీతంపైనే దృష్టి పెట్టిన ఆయన, సౌత్ సినీ ఇండస్ట్రీలో టాప్ మ్యూజిక్ డైరెక్టర్స్ లో ఒకరిగా ఎదిగారు. ముఖ్యంగా టాలీవుడ్ లో స్టార్ హీరోల సినిమాలకు వరుసగా సంగీతం అందిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. ఇప్పుడు 20 ఏళ్ల తర్వాత మరోసారి నటుడిగా రీఎంట్రీ ఇవ్వడం ఆ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. కోట్లు కొల్లగొడుతున్న తండ్రీకూతుళ్లు యంగ్ హీరో అథర్వ మురళి లీడ్ రోల్ లో నటిస్తున్న ఆ చిత్రానికి ఆకాశ్ భాస్కరన్ దర్శకత్వం వహించారు. ప్రీతి ముకుందన్, కయదు లోహర్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. తాజాగా విడుదలైన తెలుగు ట్రైలర్ ను చూస్తే ఇది లవ్, ఎమోషన్స్, మ్యూజిక్ చుట్టూ సాగే కథగా కనిపిస్తోంది. కాలేజీ బ్యాక్ డ్రాప్, యువతను ఆకట్టుకునే ప్రేమకథ, సంగీతానికి ఇంపార్టెన్స్ ఇచ్చిన సన్నివేశాలు ప్రేక్షకుల్లో ఆసక్తి కలిగిస్తున్నాయి. ఆ సినిమాలో తమన్ పాత్ర కథకు కీలక మలుపు తీసుకొచ్చేలా ఉంటుందని ట్రైలర్ ద్వారా కనిపిస్తోంది. నటుడిగా ఆయనకు ఇది రెండో ఇన్నింగ్స్ కావడంతో ప్రేక్షకులు ఎలా రిసీవ్ చేసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. అదే సమయంలో సంగీత దర్శకుడిగా కూడా వర్క్ చేయడం ఆ సినిమాకు మరో ప్రత్యేకతగా చెప్పొచ్చు. ట్రైలర్ లో వినిపించిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ కూడా సినిమాపై అంచనాలను పెంచుతోంది. ప్రస్తుతం తమన్ సంగీత దర్శకుడిగా మంచి ఫామ్ లో ఉన్నారని చెప్పడంలో డౌట్ అక్కర్లేదు. ఆయన మ్యూజిక్ అందించిన అనేక చిత్రాలు మంచి రెస్పాన్స్ పొందుతున్నాయి. అలాంటి సమయంలో నటుడిగా చేసిన ప్రయత్నం సక్సెస్ అయితే ఫ్యూచర్ లో మరిన్ని ఛాన్సులు కూడా ఆయనను వెతుక్కుంటూ వచ్చే అవకాశం ఉందని సినీ ఎక్స్పర్ట్స్ భావిస్తున్నారు. మ్యూజిక్ తో పాటు యాక్టింగ్ లో కూడా తన ముద్ర వేయగలరా అనే చర్చ కూడా సాగుతోంది. అయితే ఇప్పటికే హృదయం మురళి మూవీ ట్రైలర్ కు సోషల్ మీడియాలో మంచి రెస్పాన్స్ వస్తోంది.


## మారుతి కొత్త కథ కోసం మరో ఏడాదా?

అయితే 'ది రాజాసాబ్' చిత్రం తర్వాత మారుతి తీసుకున్న సుదీర్ఘ విరామం ఫిలింనగర్ సర్కి ల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. టాలీవుడ్‌లో దర్శకుడు మారుతి అంటే? తక్కువ సమయంలో ఎక్కువ కంటెంట్ అందించే క్రియేటర్ అనే ముద్ర బలంగా ఉంది.



అయితే -ది రాజాసాబ్- చిత్రం తర్వాత మారుతి తీసుకున్న సుదీర్ఘ విరామం ఫిలింనగర్ సర్కి ల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. గత కొంతకాలంగా మీడియాకు, పబ్లిక్ ఈవెంట్లకు దూరంగా ఉంటూ పూర్తిగా తన వ్యక్తిగత స్పేస్‌లోకి వెళ్లిపోవడం వెనుక బలమైన కారణాలే ఉన్నాయని తెలుస్తోంది. ఈ నిశబ్దం కేవలం విరామం మాత్రమే కాదు. తన కెరీర్ గ్రాఫ్‌ను తిరిగి మలచుకోవడానికి చేస్తున్న మౌన కసరత్తు అని అర్థమవుతోంది. సాధారణంగా మారుతి శైలి వేరు. ఒక సినిమా సెట్స్‌పై ఉండగానే మరో కథను సిద్ధం చేసుకునే వేగం ఆయన సొంతం. కానీ ఈసారి అందుకు భిన్నంగా ఏడాది గ్యాప్ తీసుకోవడం వెనుక గత చిత్రాల లోటుపాట్లను సరిదిద్దుకోవాలనే పట్టుదల కనిపిస్తోంది. కథా చర్చలు ఇంకా ప్రాథమిక దశలోనే ఉండటం వెనుక ఉద్దేశ్యం ఒక్కటే ప్రేక్షకుల నాడికి తగ్గట్టుగా మారుతి మార్కు ఎంటర్టైన్మెంట్ దాటి కొత్త అనుభూతిని అందించాలన్నదే. మారుతి పాత ఫార్ములాలకు స్వస్తి పలికి కొత్త జానర్ వైపు అడుగులు వేస్తున్నారని సన్నిహిత వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం ప్రేక్షకులు కంటెంట్ విషయంలో చాలా క్లారిటీగా ఉంటున్నారు. కామెడీ మాత్రమే కాకుండా ఎమో షనల్‌గా కనెక్ట్ అయ్యే కథలకు పట్టం కడుతున్నారు. ఈ మార్పును గుర్తించిన మారుతి తదుపరి స్క్రిప్టును సిద్ధం చేయడంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. కామెడీని ప్రధాన అస్త్రంగా వాడుకుంటూనే కథలో లోతును పెంచడం ఎలా? అనే విషయంపై తీవ్రమైన మేధోమథనం చేస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే మారుతి ఏ విషయాన్ని కూడా అత్యవసరంగా బయటకు రానివ్వడం లేదని తెలుస్తోంది. కోట్లు కొల్లగొడుతున్న తండ్రీకూతుళ్లు ఇక టెక్నికల్ – ప్రొడక్షన్ పరంగా కూడా మారుతి రాజీ పడకూడదని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. గతంలో కొన్నిసార్లు వేగంగా సినిమాలు పూర్తి చేయాలనే ఒత్తిడిలో సాంకేతిక విలువలను పక్కన పెట్టాల్సి వచ్చింది. ఇప్పుడు అలాంటి పరిస్థితులు తలెత్తకూడదనే ఉద్దేశ్యంతో ప్రీ-ప్రొడక్షన్ పనులకే అత్యధిక సమయం కేటాయిస్తున్నారు. నిర్మాతలు కూడా మారుతికి పూర్తి స్వేచ్ఛను ఇవ్వడమే కాకుండా క్వాలిటీ విషయంలో ఎంత ఖర్చయినా? వెనుకాడొద్దని సూచించినట్లు టాక్. కాస్టింగ్ విషయంలో కూడా మారుతి ప్లాన్ డిఫరెంట్‌గా ఉందిట. సాధారణంగా స్టార్ హీరోలతో చేసినప్పుడు ఉండే పరిమితులు కథా పరంగా వచ్చే ఒత్తిళ్లను అధిగమిస్తూ ఈసారి స్క్రిప్టుకు సరైన పాత్రలను ఎంచుకోవడంలో ఆచితూచి అడుగులు వేస్తున్నారుట. ఒక స్టార్ నటుడిని ఎలా సరికొత్తగా ఆవిష్కరించాలనే దానిపై మారుతి కసరత్తు చేస్తున్నారుట. కమర్షియల్ లెక్కలకే ప్రాధాన్యత ఇవ్వకుండా మేకింగ్ స్టైల్ ఎలా ఉండాలో? కూడా కొత్త ప్లాన్ సిద్ధం చేస్తున్నట్లు వినికిడి. మొత్తంగా మారుతి నిశ్శబ్దం వెనుక భారీ ప్రణాళికే ఉంది. వేగంగా సినిమాలు చేయడం కంటే వచ్చిన అవకాశాన్ని క్వాలిటీ ప్రొడక్ట్‌గా మలచాలన్నదే ప్రస్తుత లక్ష్యం. ఏడాదిలో మారుతి నుంచి రాబోయే ప్రకటన మారుతి పాత ఇమేజ్‌ను చెరిపేసి కొత్త దర్శకుడిగా మారుతిని పరిచయం చేసేలా ఉంటుందని అభిమానులు ఆశిస్తున్నారు.

## అన్నయ్య బర్త్ డే భారీగానే ప్లాన్ చేస్తున్నారా?



మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు అంటే తెలుగు సినీ పరిశ్రమలో పండుగ వాతావరణం నెలకొంటుంది. ఆగస్టు 22న ప్రపంచవ్యాప్తంగా ఉన్న మెగా అభిమానులు ఆరోజును ఎంతో ఘనంగా జరుపుకుంటారు. మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు అంటే తెలుగు సినీ పరిశ్రమలో పండుగ వాతావరణం నెలకొంటుంది. ఆగస్టు 22న ప్రపంచవ్యాప్తంగా ఉన్న మెగా అభిమానులు ఆరోజును ఎంతో ఘనంగా జరుపుకుంటారు. ఈ నేపథ్యంలో ఈసారి చిరంజీవి పుట్టినరోజు వేడుకలను భారీ స్థాయిలో ప్లాన్ చేస్తున్నట్లు మెగా వర్గాల నుంచి అందుతున్న సమాచారం. ఈసారి వేడుకలను అభిమానుల సమక్షంలో గ్రాండ్ గా నిర్వహించాలని కుటుంబ సభ్యులు నిర్ణయిస్తున్నట్లు తెలిసింది. ఈ వేడుకల్లో భాగంగా హైదరాబాద్‌లో ఓ ప్రత్యేక ఈవెంట్‌ను నిర్వహిం చబోతున్నారని సమాచారం. ఈవెంట్‌లో చిరంజీవి స్వయంగా పాల్గొని అభిమానులతో కలిసి భారీ కేక్ కట్ చేయబోతున్నారని తెలుస్తోంది. కొన్నేళ్లుగా సామాజిక దూరం .. ఇతర కారణాల వల్ల అభిమానులతో చిరంజీవి ప్రత్యక్షంగా కలుసుకోవడం కొంత పరిమితమైంది.

ఈ నేపథ్యంలో ఈసారి అందుకు భిన్నంగా అభిమానుల ఆనందమే లక్ష్యంగా కార్యక్రమాన్ని తీర్చిదిద్దుతున్నారని మెగా సన్నిహిత వర్గాల ద్వారా తెలిసింది. ఈ వేడుకల వెనుక ఉన్న మరో ముఖ్య ఉద్దేశ్యం చిరంజీవి సినిమాలపై ఉన్న క్రేజ్‌ను మరోస్థాయికి తీసుకెళ్లడం. ప్రస్తుతం ఆయన నటిస్తున్న చిత్రాల అప్‌డేట్స్‌ను, టీజర్లను.. ఫస్ట్ లుక్ పోస్టర్లను వేడుకలోనే ఆవిష్కరించే అవకాశం ఉందని పరిశ్రమలో చర్చ జరుగుతోంది. ఇది కేవలం పుట్టినరోజు వేడుక మాత్రమే కాదు. మెగాస్టార్ కెరీర్‌లోని తదుపరి మైలురాళ్లను అభిమానులతో పంచుకునే ఓ వేదికగా మారనుందంటున్నారు. భారీ ఈవెంట్‌కు సంబంధించిన ఏర్పాట్లను స్వయంగా మెగా కుటుంబ సభ్యులు .. సుష్మిత కొణిదెల పర్యవేక్షిస్తున్నట్లు సమాచారం. సుష్మిత నిర్మాణ రంగంలోకి వచ్చినప్పటి నుంచి కుటుంబ కార్యక్రమాలను చాలా పక్కాగా, కళాత్మకంగా ప్లాన్ చేస్తున్నారు. డాడ్ పుట్టినరోజు వేడుకను కూడా అందరూ గుర్తుండిపోయేలా క్రమశిక్షణతో కూడిన ఓ వేడుకగా నిర్వహించడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిసింది. కోట్లు కొల్లగొడుతున్న తండ్రీకూతుళ్లు అన్నయ్య బర్త్ డే సందర్భంగా చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా దేశ వ్యాప్తంగా అభిమానులు ఉచిత రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం పరిపాటే. ప్రతీ ఏటా ఇది జరిగే కార్యక్రమమే అయినా ఈ సారి పుట్టినరోజు వేడుకల్లో భాగంగా మరిన్ని సేవా కార్యక్రమాలను కూడా చేపట్టే అవకాశం ఉందంటున్నారు.


ఈసారి వేడుకల్లో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కూడా పాల్గొనే అవకాశాలు ఉన్నాయంటున్నారు. అదే జరిగితే ఆ వైబ్ వేరే లెవల్లో ఉంటుంది. మెగాస్టార్‌ం పవర్ స్టార్ ఒకే వేదికపై ఉంటే? ఆ ఊపు ఎలా ఉంటుందో చెప్పాల్సిన పనిలేదు. వారితో పాటు మెగా పవర్ స్టార్ సహా మిగిలిన మెగా హీరోలంతా కూడా పాల్గొంటారు కాబట్టి ఆ వేదికను చూడటానికి రెండు కళ్లు చాలవు.

## 'ది ప్యారడైజ్' క్లైమాక్స్.. ఓ రేంజ్ హైప్ ఇస్తున్న ఆయా షేర్ రచయిత




టాలీవుడ్ నుంచి రాబోతున్న పలు అవైటెడ్ క్రేజీ ప్రాజెక్ట్ లలో నాచురల్ స్టార్ నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల కలయికలో చేస్తున్న రెండో చిత్రం "ది ప్యారడైజ్" కూడా ఒకటి. భారీ అంచనాలు సెట్ చేసుకున్న ఈ పాన్ ఇండియా సినిమా ఇప్పుడు షూటింగ్ దాదాపు పూర్తి చేసుకోవచ్చింది. ఇదిలా ఉండగా ఈ సినిమా క్లైమాక్స్ పై ప్రముఖ సాహిత్య రచయిత ఈ సినిమాకి ఆయా షేర్ అనే సెన్సేషనల్ చార్ట్ బస్టర్ ని అందించిన కాసర్ల శ్యామ్ ఇంట్రెస్టింగ్ అప్డేట్ తో హైప్ మరింత పెంచేశారు. ప్యారడైజ్ క్లైమాక్స్.. ఆపుకోలేక పెడుతున్నా.. నా మాట గుర్తుంచుకోండి అంటూ ఈ సినిమా క్లైమాక్స్ పార్ట్ ని ఆకాశానికి ఎత్తేసారు. దీనితో ప్యారడైజ్ క్లైమాక్స్ షూట్ ని కూడా పూర్తి చేసుకుంది అని చెప్పొచ్చు. ఇక ఈ చిత్రంలో నాని సరసన కయాదు లోహర్ హీరోయిన్ గా నటించగా అనిరుద్ సంగీతం అందిస్తున్నాడు. అలాగే ఎస్ ఎల్ వి సినిమాస్ వారు నిర్మాణం వహిస్తున్న సంగతి తెలిసిందే.

## "రాకా"లో ఛాన్స్ మిస్ చేసుకున్న 'బ్లాస్ట్' బ్యూటీ!



ప్రస్తుతం ఇండియన్ సినిమా దగ్గర నుంచి రాబోతున్న పలు బిగ్గెస్ట్ ప్రాజెక్ట్ లలో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా దీపికా పదుకోణ్ హీరోయిన్ గా కోలీవుడ్ స్టార్ దర్శకుడు అట్లీ తెరకెక్కిస్తున్న భారీ చిత్రం "రాకా" కూడా ఒకటి. ఎన్నో అంచనాలు సెట్ చేసుకున్న ఈ సినిమాలో రీసెంట్ సూపర్ హిట్ చిత్రం "బ్లాస్ట్" బ్యూటీ ప్రీతీ ముకుందన్ కూడా నటించాల్సి ఉందట. తెలుగులో కన్నప్ప సినిమాలో మెరిసిన ఈ బ్యూటీ "బ్లాస్ట్" సినిమాతోనే మరింత చేరువ అయ్యింది. అందంతో పాటుగా యాక్షన్ కూడా చేసి సర్ప్రైజ్ చేసిన ప్రీతీ ముకుందన్ ని తన రాకా సినిమా కోసం అప్రోచ్ అయ్యానని కానీ ఆమెకి ఉన్న బిజీ షెడ్యూల్ వల్ల కుదరలేదు అని స్వయంగా అట్లీ తెలిపాడు. లేటెస్ట్ గా జరిగిన 'ఇదయమ్ మురళీ' సినిమా ఈవెంట్ కి గెస్ట్ గా వెళ్లిన అట్లీ ఈ విషయాన్ని షేర్ చేసుకోగా ప్రీతి రోల్ ని ఫెమినా జార్జ్ ఆమె ప్లేస్ లోకి వచ్చింది. ఇక ఇదయమ్ మురళీ సినిమాలో అథర్వ హీరోగా నటించగా కయాదు లోహర్, ఫహద్ ఫాజిల్ లాంటి స్టార్స్ కూడా ఉన్నారు. అలాగే ఆకాష్ భాస్కరన్ దర్శకత్వం వహించారు.

## ఒకవేళ నెమలి గనుక ఒక అందమైన అమ్మాయి రూపం దాలిస్తే.. అది కచ్చితంగా నయనతారే అవుతుంది!



సౌత్ ఇండస్ట్రీ లేడీ సూపర్ స్టార్ నయనతార గ్లామర్ పరంగానే కాకుండా తన క్లాసీ స్టైల్‌తోనూ ఎల్లప్పుడూ ట్రెండ్ సెట్ చేస్తూనే ఉంటారు. తాజాగా ఈ సీనియర్ బ్యూటీ తన అధికారిక ఇన్‌స్టా ఖాతాలో షేర్ చేసిన కొన్ని అద్భుతమైన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. నెమలి రంగు శారీ కట్టుకుని.. సాంప్రదాయకమైన లుక్‌లో నయనతార మెరిసిపోతున్న తీరుకు అటు అభిమానులు, ఇటు సినిమా సెలబ్రిటీలు సైతం ఫిదా అయిపోతున్నారు. చీర కట్టులో నయనతార దేవతలా ఉంటుందని ఈ తాజా చిత్రాలు మరోసారి నిరూపించాయి. ఈ పోస్ట్‌కు ఇండస్ట్రీ నుండి వస్తున్న స్పందన చూస్తే నయన్ క్రేజ్ ఏంటో అర్థమవుతుంది. ప్రముఖ నటి అదితి రావు హైదరి హార్ట్ ఎమోజీలతో తన అభిమానాన్ని చాటుకోగా.. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ కుమార్తె ఖతీజా రెహమాన్ కూడా ఫైర్, హార్ట్ ఎమోజీలతో నయనతార రాయల్ లుక్‌ను తెగ మెచ్చుకున్నారు. సెలబ్రిటీల కామెంట్లతో ఈ పోస్ట్ మరింత వైరల్‌గా మారింది. మరోవైపు నయన్ తమిళ అభిమానుల కామెంట్లు చాలా ఆసక్తికరంగా ఉన్నాయి. -అళగి- (అందగత్తె), -ఎన్ మయిలే- (నా నెమలి) అంటూ తమిళంలో నెటిజన్లు కవితలు కురిపిస్తున్నారు. ఒకవేళ నెమలి గనుక ఒక అందమైన అమ్మాయి రూపం దాలిస్తే.. అది కచ్చితంగా నయనతారే అవుతుంది! అంటూ కొందరు నెటిజన్లు పోలికలు తీసుకొస్తున్నారు. నయనతార శారీ కడితే అది ఎప్పటికీ అవుట్ ఆఫ్ స్టైల్ అవ్వదు.. ఇక ఈ శారీ లుక్ ట్రెండింగ్ అవ్వడం ఖాయం! అని కామెంట్లు పెడుతున్నారు. ఒక అభిమాని అయితే ఈ అద్భుతమైన గ్లో అంతా నయనతార సొంత కాస్మెటిక్ బ్రాండ్ 9స్కిన్ ప్రొడక్ట్స్ వల్లేనంటూ రాసుకొచ్చారు. ఇదే కామెంట్ సెక్షన్‌లో సినిమా గాసిప్స్ కూడా సందడి చేశాయి. ఒక నెటిజన్ నయనతార లుక్‌కు స్పందిస్తూ.. మీరు జైలర్ 2 సినిమాలో ఉన్నారని నాకు తెలుసు! అంటూ సరికొత్త గాసిప్ ప్రచారానికి తెరలేపారు. మొత్తానికి ఈ సరికొత్త బ్లూ శారీ లుక్ ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రస్తుతం విపరీతంగా ట్రెండ్ అవుతూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలిచింది. కేవలం సోషల్ మీడియా అప్‌డేట్స్‌తోనే కాకుండా.. సినిమాల పరంగానూ నయనతార చేతిలో ప్రస్తుతం వైవిధ్యమైన ప్రాజెక్టులు ఉన్నాయి. అందులో భారీ అంచనాలున్న మూకుత్తి అమ్మన్ 2- చిత్రం ప్రస్తుతం పోస్ట్-ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. అలాగే -మన్నంగట్టి సిన్స్ 1960-, -హాయ్- చిత్రాలు షూటింగ్ పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. వీటితో పాటు హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న -రాక్కాయి- చిత్రం ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. 2026లో మరికొన్ని క్రేజీ ప్రాజెక్ట్‌లపై సంతకాలు చేసిన నయన్ ఈ వరుస చిత్రాలతో బాక్సాఫీస్ వద్ద మరోసారి సూపర్‌హవా చూపించడానికి సన్నద్ధమవుతున్నారు.

Edited, Printed, Published and Owned by Bavanari Ravi kumar. Printed at M/s Manikanta Enterprises, H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State.
Published at H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State. Editor: Bavanari Ravi Kumar. RNI No.TELTEL/2014/55197